విశాఖపట్టణం
సోమవారం 21 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 220 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool





## సచివాలయ ఉద్యోగులకు ఏఏఎస్

ఆరేళ్లు పూర్తి చేసిన వారికి 11వ పీఆర్సీ అమలు

స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ మంజూరు.. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

2

## ఎల్ నినో యాక్షన్ ప్లాన్‌ను
# పక్కాగా అమలు చేయాలి

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

మార్కెట్ లో సరఫరా, నిల్వలను పర్యవేక్షించాలి

ఉద్యాన పంటలకు ప్రాధాన్యతనివ్వాలి

రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడరాదు

సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

వర్షాభావ పరిస్థితులపై అధికారులతో సమీక్ష





**(అమరావతి - జయజయహే)**

ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాలుగా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతును కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు, పంటల బీమా, హైరిస్క్ ఉద్యాన పంటలకు రక్షణ, తాగునీరు--పశు గ్రాసం అందుబాటులో ఉంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రైతులపైనే కాకుండా అన్ని వ్యవస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు. విపత్తుల సమయంలో వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఎల్‌నినోను సవాలుగా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, సాగునీటి సంఘాలకు ..మిగతా 2లో



## రాజకీయాలకు విద్యావ్యవస్థ దూరం

సమాజ మార్పునకు శక్తివంత సాధనం విద్య

పాఠశాలలో నాణ్యతా ప్రమాణాలు పెంచుతాం

మంత్రి నారా లోకేశ్ హితబోధ

చాగంటితో కలసి కాకినాడలో భారతీయం నిర్వహణ

**(కాకినాడ - జయజయహే)**

సమాజ పురోగతికి, సమగ్ర మార్పునకు విద్య అత్యంత శక్తివంతమైన సాధనమని, అటువంటి పవిత్రమైన విద్యా వ్యవస్థను ఎట్టిపరిస్థితుల్లోనూ రాజకీయాలకు దూరంగా ఉంచాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో పర్యటించిన ఆయన.. ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో నిర్వహించిన భారతీయం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, మానసిక స్థైర్యం, దేశభక్తి పెంపొందించడమే లక్ష్యంగా ..మిగతా 2లో

# సామాన్యుడికి చుక్కలే..!

బియ్యం.. చక్కెర.. పైపైకి..!

అదే దారిలో నూనెలు, పప్పుదినుసులు

భారీగా పెరగనున్న ధరలు

ఎల్ నినో ప్రభావమే కారణం

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

దేశంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు షాకింగ్ న్యూస్. దేశవ్యాప్తంగా బియ్యం, చక్కెర ధరలు పెరగనున్నాయి. అంతేకాదు, ఉల్లితో పాటు కూరగాయల ధరలు కూడా అమాంతం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా 'ఎల్ నినో' ప్రభావం, తక్కువ వర్షపాతం కారణంగా ఈ ఏడాది వరి దిగుబడి భారీగా ..మిగతా 2లో



## ఇకపై స్పోర్ట్స్ కోటాకు
# స్కిల్ టెస్ట్

ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ అభ్యర్థులకూ వర్తింపు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ కీలక నిర్ణయం

డిఎస్సీ అక్రమాల ఆరోపణల నేపథ్యంలో అమలు

**(అమరావతి - జయజయహే)**

స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్ల దుర్వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక నిర్ణయం తీసుకుంది. స్పోర్ట్స్ కోటా కింద ప్రవేశాలు పొందే అభ్యర్థుల కోసం తొలిసారిగా స్కిల్ టెస్ట్ నిర్వహించనుంది. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశాల్లో స్పోర్ట్స్ కోటాను వినియోగించుకునే అభ్యర్థులకు ఈ నెల 21న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్కిల్ టెస్ట్ ..మిగతా 2లో



## తరుముకొస్తున్న వర్షాలు..!

బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

దక్షిణ ఒడిశా--ఉత్తరాంధ్ర తీరాల్లో కేంద్రీకృతం

ఇవాళ, రేపు, ఎల్లుండి భారీ వర్షాలు

గంటకు 50-60 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు

**(విశాఖపట్నం - జయజయహే)**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతోంది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతున్న ఈ వ్యవస్థ సెప్టెంబర్ 21న వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అనంతరం సెప్టెంబర్ 22 నాటికి ఇది తీవ్ర వాయుగుండంగా బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. సెప్టెంబర్ 23 ఉదయం నాటికి ఉత్తరాంధ్ర--దక్షిణ ఒడిశా తీరాలకు సమీపించే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌లో ..మిగతా 2లో

## రూ. 661 కోట్లతో
# అసెంబ్లీ ఐకానిక్ బిల్డింగ్

250 మీటర్ల ఎత్తున స్పైర్ నిర్మాణం

టెండర్లు పిలిచేందుకు పరిపాలనా ఆమోదం



**(అమరావతి - జయజయహే)**

రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అమరావతి నడిబొడ్డున అత్యంత ఎత్తైన, ఆకర్షణీయమైన భవనాల్లో ఒకటిగా నిలిచే అసెంబ్లీ ఐకానిక్ భవనంపై 250 మీటర్ల ఎత్తున్న 'స్పైర్' నిర్మాణానికి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. దీని నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలిచేందుకు వీలుగా రూ.661 కోట్లకు పరిపాలనాపరమైన ఆమోదం తెలిపినట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 66వ సీఆర్డీఏ ..మిగతా 2లో

# స్కూళ్లకు దసరా సెలవులు

తెలంగాణలో 13 రోజులు, ఏపీలో 10 రోజులు

ప్రకటించిన విద్యాశాఖ

**(హైదరాబాద్ - జయజయహే)**



ఏపీ, తెలంగాణలోని విద్యార్థుకు భారీ శుభవార్త అందింది. దసరా సెలవుల లిస్టును తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. తెలంగాణలో ఒకలా.. ఏపీలో మరోలా సెలవులు ఉన్నాయి. ఈ మేరకు విద్యాశాఖలు దసరా సెలవుల లిస్టును విడుదల చేశాయి. దసరా వస్తుందంటే చాలు.. ముందుగా సెలవుల గురించే ఎక్కువ చర్చ జరుగుతూ ఉంటాయి. విద్యార్థులు పండుగ సెలవుల కోసం ఎదురుచూస్తుంటారు. సెలవుల్లో తమ సొంతూర్లకు వెళ్లి కుటుంబంతో సరదాగా గడుపుతుంటారు. ఏపీ, తెలంగాణలో విద్యాసంస్థలకు దసరా సెలవులు ఎప్పటినుంచి ఎప్పటివరకు అనేది ఇప్పుడు చూద్దాం.

**ఏపీ, తెలంగాణలో దసరా సెలవులు ఇవే..**

తెలంగాణలో మొత్తం 13 రోజుల పాటు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. దసరాతో పాటు బతుకమ్మ కూడా

# ఎల్ నినో యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాలి

మొదటి పేజీ తరువాయి...

సూచించారు. ఖరీఫ్ సాగు పరిస్థితులపై సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం లోటును సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు ఉందని వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. పప్పుధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నప్పటికీ నూనెగింజల సాగు తక్కువగా ఉందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇప్పటికే సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్లాన్‌ను పరిస్థితులకు అనుగుణంగా సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయ సాగు ఏర్పాట్లపై సమీక్షలో భాగంగా రైతులకు అందించిన విత్తనాలు, ఇతర వ్యవసాయ వనరులపై సీఎం చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. 5.21 లక్షల హెక్టార్లకు పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేశామని తెలిపారు. 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందించామని చెప్పారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావ పంటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఆదేశించారు. సంప్రదాయేతర ప్రాంతాల్లో ఉల్లి, మిరప సాగును కూడా ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఉద్యాన పంటలకు ఎల్‌నినోతో ఏర్పడే ముప్పుపై సమీక్ష సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన రక్షణ చర్యలను సీఎం పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలపై హైరిస్క్ ఉందని తెలిపారు. ఈ పంటలను



కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఆ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. కేంద్రం కొన్ని పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరపై కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పంటలకు ఏర్పడే నష్టాన్ని ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిత్యావసరాల ధరల నియంత్రణపై సమీక్ష సందర్భంగా మార్కెట్‌లో సరఫరా, నిల్వల పరిస్థితిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను అదుపులో ఉంచాలని ఆదేశించారు. గోడౌన్లలో ఉన్న బియ్యం నిల్వల వివరాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన మేర బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉల్లి ధరలను నియంత్రించేందుకు వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉల్లి సాగును ప్రోత్సహించాలని సూచించారు. పామాయిల్, కందిపప్పు ధరల నియంత్రణకు ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు. కూరగాయల సరఫరాను పెంచే ప్రత్యామ్నాయ మార్గాలపైనా సీఎం సమీక్షించారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించాలని సూచించారు. వీటిని వ్యవస్థీకృతం చేయగలిగితే స్థానికంగా కూరగాయల ఉత్పత్తి పెంచవచ్చని తెలిపారు. ఉత్పత్తి పెరిగితే కూరగాయల ధరలను కూడా నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు మార్కెట్ డిమాండ్‌పై ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. ఉత్పత్తి, సరఫరా, ధరల మధ్య సమతుల్యత ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పశువులకు నీటితో పాటు పశుగ్రాసం అందేలా చూడాలని ఆదేశించారు. పశుగ్రాసం పెంచే చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. మల్చింగ్ కోసం అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పచ్చదనం ఏ మాత్రం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీబీ జీ రామ్‌జీ పనులను అనుసంధానం చేసుకుంటూ జలధార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు.

# ఇకపై స్పోర్ట్స్ కోటాకు స్కిల్ టెస్ట్

మొదటి పేజీ తరువాయి...

నిర్వహించనున్నట్లు శాప్ సెప్టెంబర్ 18న ప్రకటించింది. స్పోర్ట్స్ కోటా కింద ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ తప్పనిసరిగా ఈ పరీక్షకు హాజరుకావాలని శాప్ స్పష్టం చేసింది. నిపుణుల పర్యవేక్షణలో అభ్యర్థుల క్రీడా నైపుణ్యాలను పరీక్షించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్ ప్రవేశాల్లో 0.5 శాతం స్పోర్ట్స్ కోటా అమల్లో ఉంది. 2026--27 విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,50,828 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రిజర్వేషన్ ప్రకారం సుమారు 754 సీట్లు స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసే అవకాశం ఉంది. అయితే కన్వీనర్ కోటా, కళాశాల, కోర్సుల వారీగా అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా తుది కేటాయింపు జరుగుతుంది. స్పోర్ట్స్ కోటా ప్రయోజనం పొందాలంటే అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించి ఉండాలి. సంబంధిత అసలు క్రీడా ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాలకు గుర్తింపు పొందిన క్రీడల్లో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, జూడో, కబడ్డీ, ఖో-ఖో, షూటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, వాలీబాల్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్ తదితరాలు ఉన్నాయి. అయితే కొన్ని క్రీడా సంఘాలు నకిలీ ధ్రువపత్రాలు జారీ చేశాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సెప్టెంబర్ 21న స్కిల్ టెస్ట్ నిర్వహించేందుకు శాప్ చర్యలు చేపట్టింది.

**స్పోర్ట్స్ కోటాలో అక్రమాల ఆరోపణలు..**

గత ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన మెగా డీఎస్సీ 2025 నియామకాల్లోనూ స్పోర్ట్స్ కోటా అంశం వివాదాస్పదమైంది. కేవలం పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల ఆధారంగా కొందరికి ఉద్యోగాలు లభించాయని, ఉద్యోగాలు పొందిన వారిలో అసలు పతక విజేతలు చాలా తక్కువగా ఉన్నారని ఆరోపణలు వచ్చాయి. క్రీడా సంఘాలు జారీ చేసిన ధ్రువపత్రాలు, అభ్యర్థుల స్వీయ ప్రకటనల ఆధారంగా నకిలీ క్రీడాకారులు ఉద్యోగాలు పొందారని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ అంశంపై దర్యాప్తు కోరుతూ ఆ సంఘం హైకోర్టును ఆశ్రయించి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో స్పోర్ట్స్ కోటా అమల్లోకి వచ్చినప్పటి నుంచే వైద్య, సాంకేతిక విద్యా ప్రవేశాల్లో అక్రమాల ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా ఇంజినీరింగ్, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లో అనర్హులు, నకిలీ క్రీడాకారులు స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రవేశాలు పొందారనే ఆరోపణలు వచ్చినప్పటికీ సమగ్ర దర్యాప్తు జరగలేదనే విమర్శలు ఉన్నాయి. 2017 ఆగస్టులో మెడికల్ ప్రవేశాల్లో నకిలీ క్రీడా ధ్రువపత్రాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్క్రూటినీ కమిటీ నివేదికను అప్పటి శాప్ ఎజ-వీణకి సమర్పించింది. ఆ దర్యాప్తు ఆధారంగా వైద్య సీటు పొందిన రిత్విక్ రెడ్డి అనే విద్యార్థిని ఫైనల్ పరీక్షలకు హాజరుకాకుండా విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నట్లు సమాచారం. మరో యువతి హాసిని రెడ్డి కూడా నకిలీ ధ్రువపత్రంతో మెడికల్ సీటు పొందినట్లు గుర్తించారు.

**372 ఉద్యోగాల భర్తీపై వివాదం**

మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 372 ఉద్యోగాలు భర్తీ చేసిన వ్యవహారం కూడా వివాదానికి దారితీసింది. నకిలీ ధ్రువపత్రాలతో 100 మందికి పైగా అనర్హులు ఉద్యోగాలు పొందారని ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ ఆరోపించింది. పోటీలు జరగని క్రీడా పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొంటూ కొందరు సమర్పించిన ధ్రువపత్రాలను కూడా శాప్ ఆమోదించిందనే ఆరోపణలు వచ్చాయి. ఒకే కుటుంబానికి చెందిన పలువురు, ఒకే క్రీడకు చెందిన పలువురు వ్యక్తులు ఉద్యోగాలు పొందినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై శాప్ ఎండీ భరణి, విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా ఇటీవల సంయుక్తంగా సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించారు. 2016 నుంచే నకిలీ ధ్రువపత్రాలపై ఆరోపణలు వస్తున్నప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఈ సందర్భంగా తెరపైకి వచ్చాయి. మెగా డీఎస్సీలో ఎంపికైన వారికి స్కిల్ టెస్ట్ నిర్వహించకుండా 372 స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించగా, ఇకపై క్రీడాకారులకు స్కిల్ టెస్టులు నిర్వహిస్తామని శాప్ ఎండీ భరణి పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తయిన నియామకాల విషయంలో మాత్రం ఏమీ చేయలేమని ఆయన చెప్పినట్లు సమాచారం.

**స్పోర్ట్స్ కోటాకు స్పష్టమైన మార్గదర్శకాలు లేవా?**

ఉన్నత విద్యా ప్రవేశాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో స్పోర్ట్స్ కోటా అమలుకు సంబంధించి సరైన మార్గదర్శకాలు లేవనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మెడికల్ ప్రవేశాల్లో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో స్పోర్ట్స్ కోటాను పూర్తిగా రద్దు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం స్పోర్ట్స్ కోటా కొనసాగుతోంది. స్పోర్ట్స్ కోటా ద్వారా మెడికల్ సీట్లు పొందడం సులభంగా మారిందని కొన్ని క్రీడా సంఘాలపై ఆరోపణలు ఉన్నాయి. గత దశాబ్దంలో కనీసం 100 మంది నకిలీ క్రీడాకారులు స్పోర్ట్స్ కోటా ద్వారా మెడికల్ సీట్లు పొందారని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం ఆరోపించినట్లు సమాచారం. ఈ అంశంపై హైకోర్టులో న్యాయపోరాటం కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు. గతంలోనూ కేవలం క్రీడా సంఘాల ధ్రువపత్రాలు, శాప్ ఆమోదంతో స్కిల్ టెస్ట్ లేకుండానే మెడికల్, ఇంజినీరింగ్ సీట్లు పొందిన అభ్యర్థులపై విజిలెన్స్ కేసులు నమోదయ్యాయి. తర్వాత ఈ వ్యవహారం ప్రభుత్వ ఉద్యోగాలకూ విస్తరించిందనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాలు, పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు, పశుసంవర్ధక శాఖ ఉద్యోగాలు తదితరాల్లోనూ క్రీడా ధ్రువపత్రాల ఆధారంగా అనర్హులు ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి.

**హైకోర్టు పిల్ నేపథ్యంలో కీలక అడుగు**

ప్రస్తుతం హైకోర్టులో విచారణలో ఉన్నపిల్ లో స్పోర్ట్స్ కోటా అమలుపై సమగ్ర దర్యాప్తు, అలాగే క్రీడా నైపుణ్యాలను నిర్ధారించేందుకు స్కిల్ టెస్ట్ తప్పనిసరి చేయాలనే అంశాలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఏపీఈఏపీసెట్ 2026 ప్రవేశాల్లో స్పోర్ట్స్ కోటాను వినియోగించుకునే అభ్యర్థులకు తొలిసారిగా స్కిల్ టెస్ట్ నిర్వహించేందుకు శాప్ నిర్ణయించింది. స్పోర్ట్స్ కోటా ద్వారా నిజమైన ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పరీక్ష విధానం ఎంతవరకు పారదర్శకంగా అమలవుతుందనేది ఇప్పుడు కీలకంగా మారింది.

# రాజకీయాలకు విద్యావ్యవస్థ దూరం

మొదటి పేజీ తరువాయి...

ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విద్య, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి అంటే ఎంతో ప్రత్యేకమైన ఆసక్తి అని తెలిపారు. పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలు పెంచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో బాపట్లలో నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ అనుభవాన్ని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తు చేసుకున్నారు. 'ఆ రోజు విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్నే ముఖ్యమంత్రికి కూడా అందించాం. భోజనం రుచి చూసిన అనంతరం, పిల్లలకు అందించే ఆహారం క్వాంటిటీ సరిపోదని, దానిని పెంచాల్సిన అవసరం ఉందని సీఎం అక్కడికక్కడే సూచించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని ఆహార ప్రమాణాలను, పరిమాణాన్ని మెరుగుపరిచారు.' అని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఘటనపై మంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ఒక పాబాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, యువతకు ఆయన పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో ఎలాంటి క్లిష్ట పరిస్థితులు ఎదురైనా క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. సమస్య ఎంత పెద్దదైనా దానికి ఏదో ఒక మార్గం లేదా పరిష్కారం కచ్చితంగా ఉంటుందని లోకేశ్ చెప్పారు. ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మనసులోనే దాచుకోకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సమాజంలో నమ్మకమైన పెద్దలతో మాట్లాడాలన్నారు. పిల్లలు ఆవేశంలో తీసుకునే ఒక్క తప్పుడు నిర్ణయం వారి భవిష్యత్తును తుంచివేయడమే కాకుండా, కన్నవారికి జీవితాంతం తీరని శోకాన్ని మిగులుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి విద్యా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. విద్య అనేది కేవలం ఒక డిగ్రీ సాధించడానికో, ఉద్యోగం సంపాదించడానికో పరిమితం కాకూడదని.. అది ఒక మంచి సమసమాజ నిర్మాణానికి ప్రాతిపదికగా మారాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఓర్పు, సహనం, నైతిక విలువలు చాలా అవసరమని చెప్పారు. విద్యార్థులు సొంత ఎదుగుదలతో పాటు దేశం గురించి కూడా ఆలోచించాలని, అవసరమైతే దేశ సేవ కోసం త్యాగాలకు సైతం వెనుకాడకూడదని నారా లోకేస్ పిలుపునిచ్చారు. సంస్కారవంతమైన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం కలిసికట్టుగా బాధ్యత తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారతీయం వంటి కార్యక్రమాలు యువతలో సన్మార్గాన్ని, దేశభక్తిని నింపడానికి ఎంతో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ మానసిక ధైర్యంతో జీవితంలో ముందుకు సాగాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు.

# సామాన్యుడికి చుక్కలే..!

మొదటి పేజీ తరువాయి...

తగ్గుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ వివరాల ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే ఈసారి వరి ఉత్పత్తి దాదాపు 10 మిలియన్ టన్నులు తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. 2009-10 నాటి ఎల్ నినో పరిస్థితి తర్వాత పదేళ్లలో తొలిసారిగా వరి సాగు క్షీణించడం ఇదే మొదటిసారి. దీనివల్ల దేశీయంగానే కాక, విదేశాలకు ఎగుమతి అయ్యే బియ్యం ధరలు కూడా విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది. థాయ్‌లాండ్, వియత్నాంలలో బియ్యం ధరలు ఇప్పటికే రికార్డు స్థాయికి చేరడం గమనార్హం. మరోవైపు చక్కెర ధరలు కూడా సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. చెరకును ఇథనాల్ తయారీకి విస్తృతంగా వాడటమే దీనికి ప్రధాన కారణం. ప్రభుత్వం ఇతర దేశాల నుంచి దిగుమతులను పెంచినప్పటికీ ధరలు అదుపులోకి రావడం లేదు. ఇక మార్కెట్‌లో ఉల్లి ధర కిలో రూ.70 నుంచి రూ.80 వరకు పలుకుతోంది. కేంద్రం బఫర్ స్టాక్ విడుదల చేస్తున్నా ఫలితం పెద్దగా కనిపించడం లేదు. వీటితో పాటు వంట నూనెలు, అల్లం, వెల్లుల్లి, పప్పుధాన్యాలు, గోధుమల ధరలు కూడా మండిపోతున్నాయి. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం రవాణా వ్యయాన్ని పెంచి, ఇతర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమవుతోంది. ఈ పరిణామాలన్నీ కలిసి దేశంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రూ. 661 కోట్లతో అసెంబ్లీ ఐకానిక్ బిల్డింగ్

మొదటి పేజీ తరువాయి...

అథారిటీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల వివరాలను మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా ప్రతీ వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటిని అందించేలా తాగునీటి పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచనున్నారు. అలాగే ప్రధాన డ్రైనేజీ వ్యవస్థతో అనుసంధానించే లింక్ డ్రైనేజీ పైపుల ఏర్పాటుతో పాటు 'నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీ' నిధులు కలుపుకుని మొత్తం రూ.1,548 కోట్లతో టెండర్లు పిలవడానికి అథారిటీ పరిపాలనా అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అమరావతి ప్రాంతంలో ప్రముఖ ప్రైవేటు విద్యాసంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోంది. ఇందులో భాగంగా నలందా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌కు కృష్ణాయపాలెంలో 5 ఎకరాల భూమిని కేటాయించారు. రాబోయే ఏడాదిన్నర వ్యవధిలో ఈ పాఠశాల నిర్మాణం పూర్తి కానుందని మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా నేలపాడులో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కార్యాలయ నిర్మాణం కోసం 50 సెంట్ల భూమిని కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**కౌలు రూ.40 వేలకు పెంపు**

రాజధాని నిర్మాణం కోసం ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం కౌలు సొమ్ము అందిస్తోంది. జరీబు భూములకు ఎకరాకు రూ.50 వేలు, నాన్-జరీబు భూములకు రూ.40 వేలు ఇస్తున్నట్లు గుర్తుచేశారు. అయితే 2014-19 మధ్య కాలంలో ఎకరం కంటే తక్కువ భూమి ఇచ్చిన రైతులకు గతంలో రూ.30 వేలు మాత్రమే లభించేది. ప్రస్తుతం రెండో విడత భూసమీకరణ వేళ రైతుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.... ఎకరం కంటే తక్కువ భూమి ఉన్న వారికి కూడా కౌలును రూ.40 వేలకు పెంచుతూ అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. రాజధాని ప్రాంతంలోని రెవెన్యూ పరమైన సమస్యలు, చిన్నపాటి వివాదాలన్నింటినీ అక్టోబర్ చివరి నాటికి పూర్తిగా పరిష్కరిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. అక్టోబర్ నాటికి ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను 80 శాతం వరకు విజయవంతంగా పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సచివాలయ ఉద్యోగులకు ఏఏఎస్

(అమరావతి - జయజయహే)

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. సచివాలయ వ్యవస్థలో ఆరేళ్ల సర్వీస్ విజయవంతంగా పూర్తి చేసుకున్న ఉద్యోగులకు 'ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్' వర్తింపజేయాలని ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయం మేరకు 6 సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న సచివాలయ సిబ్బందికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ మంజూరు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. 11వ వేతన సవరణ సంఘం (11ష్రూ=జ) నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ విధివిధానాలను అమలు చేయనున్నారు. ఈ మేరకు స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామ విభాగ కార్యదర్శి భాస్కర్ ఐఏఎస్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో పదోన్నతి అవకాశాలు త్వరగా రాని ఉద్యోగులకు ఆర్థికంగా ఊరట కలిగించేందుకు ఈ ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌ను అమల్లోకి తెచ్చారు. ఒకే కేడర్‌లో నిర్దిష్ట కాలం (6, 12, 18, 24 ఏళ్లు) సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు తదుపరి స్కేల్‌ను మంజూరు చేస్తారు. 6 ఏళ్లు పూర్తయిన సచివాలయ సిబ్బందికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ రావడం వల్ల వారి ప్రాథమిక వేతనం పెరిగి, ప్రతినెల చేతికి వచ్చే వేతనం పెరుగుతుంది.

సచివాలయ ఉద్యోగులుగా చేరి ఆరేళ్లు పూర్తయినా ప్రమోషన్లు లభించని వారికి ఈ స్కీమ్ ద్వారా ఆర్థిక భరోసాతో పాటు ఉద్యోగంలో మెరుగైన ప్రోత్సాహం లభిస్తుంది. పెరిగిన స్కేల్‌తో పాటు డీఏ, హెచ్ఆర్ఏ అలవెన్సుల రూపంలో కూడా ఉద్యోగులకు అదనపు లబ్ధి చేకూరుతుంది. సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, 11వ పీఆర్సీ నిబంధనల ప్రకారం 6 ఏళ్ల సర్వీసును పరిగణించి ఏఏఎస్ అమలు చేయడంపై సచివాలయ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వేలాది మంది గ్రామీణ, పట్టణ సచివాలయ ఉద్యోగులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది.

## తరుముకొస్తున్న వర్షాలు..!

మొదటి పేజీ తరువాయి...

భారీ వర్షాలకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయి. ప్రస్తుతం అల్పపీడనం ఉత్తర అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. రానున్న రోజుల్లో ఇది పశ్చిమ-వాయువ్య దిశగా ప్రయాణిస్తూ మరింత బలపడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ ప్రభావంతో ఏపీలో రాబోయే మూడు రోజులు పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం అల్లూరి సీతారామరాజు, పోలవరం, నంద్యాల, కడప జిల్లాల్లో పిడుగులు, ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఇతర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి.

**గంటకు 50కిమీ వేగంతో గాలులు**

మంగళ, బుధవారాల్లో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, బుధ, గురువారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలతో పాటు గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ముఖ్యంగా కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా మారే అవకాశం కనిపిస్తోంది. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది. సముద్రం తీవ్ర అల్లకల్లోలంగా మారొచ్చని అధికారులు హెచ్చరించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే వేటకు వెళ్లిన వారు వీలైనంత త్వరగా తీరానికి చేరుకోవాలని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాలు, ఈదురుగాలుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు పలు సూచనలు చేశారు.

## స్కూళ్లకు దసరా సెలవులు

మొదటి పేజీ తరువాయి...

వస్తుండటంతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు దసరా సెలవులు ప్రకటించారు. విద్యాసంస్థలకు చివరి వర్కింగ్ డే అక్టోబర్ 9. ఆ తర్వాత సెలవుల అనంతరం అక్టోబర్ 23వ తేదీనుంచి విద్యాసంస్థలు తిరిగి తెరుకుంటాయి. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలకు ఈ సెలవులు వర్తిస్తాయి. తప్పనిసరిగా అన్ని సంస్థలు వీటిని అమలు చేయాల్సి ఉంటుంది. ఇక ఏపీ విషయానికొస్తే.. 10 రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవులు వచ్చాయి. 2026-27 విద్యా క్యాలెండర్ ప్రకారం అక్టోబర్ 12 నుంచి దసరా పండుగ సెలవులు మొదలవుతాయి. అక్టోబర్ 21 వరకు మొత్తం 10 రోజుల పాటు సెలవులు కొనసాగుతాయి. ఏపీ, తెలంగాణలో సెలవులు భిన్నంగా ఉన్నాయి. అయితే క్రైస్తవ, మైనార్టీ విద్యాసంస్థలకు సంబంధించి సెలవులు భిన్నంగా ఉంటాయి.

**బతుకమ్మ పండుగ ఎప్పుడంటే..?**

ఈ సారి అక్టోబర్ 20వ తేదీన దసరా పండుగ వస్తోంది. ఇక బతుకమ్మ కూడా ఇదే తేదీలో వస్తోంది. అక్టోబర్ 11న బతుకమ్మ ప్రారంభం కానుండగా.. అక్టోబర్ 18వ తేదీన సద్దుల బతుకమ్మ జరగనుంది. తెలంగాణ ప్రజలు బతుకమ్మను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటారు. ఇక తెలంగాణలో అక్టోబర్ 1 నుంచి 9 వరకు విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతాయి. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు అక్టోబర్ 5 నుంచి 9 వరకు, 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు అక్టోబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తారు. సెలవుల నుంచి వచ్చిన తర్వాత ఫలితాలు వెల్లడించనున్నారు. ఎస్ఏ-2 పరీక్షలు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వచ్చే ఏడాది ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 19 వరకు నిర్వహిస్తారు. పదో తరగతి ప్రీ-ఫైనల్స్ పరీక్షలు ఫిబ్రవరి 28 నాటికి పూర్తి కానున్నాయి. దసరా సెలవులకు ముందే తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు పూర్తి చేస్తుంది.

# అలరించిన సంస్కృతి గజల్ గానం

## తెలుగు గజల్స్‌తో ఆకట్టుకున్న వర్ధమాన గాయని







**విశాఖపట్నం, సెప్టెంబర్ 20, జయ జయహే :**

విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ--కళాభారతి ఆధ్వర్యంలో ప్రముఖ వర్ధమాన గజల్ గాయని కుమారి సంస్కృతి తెలుగు గజల్ గాన కార్యక్రమం ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో అలరించింది. సభాధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, ట్రస్టీ శ్రీరామ్ గోపాల్, ఆచార్య వి. బాలమోహన దాస్, యార్లగడ్డ ప్రసాద్, డా. కె.జి. వేణు, నర్సింగరావు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాభారతి అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్. రాజు మాట్లాడుతూ యువత కళల పట్ల ఆసక్తి పెంచుకుని మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేలా ప్రోత్సహించడమే కళాభారతి లక్ష్యమన్నారు. గజల్ సాహితీ ప్రక్రియను పరిచయం చేస్తూ సంస్కృతి తన గానంతో శ్రోతలను ఆకట్టుకుంది. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి రచించిన "మంచు పొగలుండేవి... మరికొద్ది నిముషాలే.. ఆ పిదప ఉండేవి ఆదిత్య కిరణాలే" గజల్‌ను దేశ్ రాగంలో ఆలపించి కరతాళధ్వనులు అందుకుంది. యువకవి కొత్తగూడెం రాజేష్ రచించిన "పదిలం పదిలం.. అమ్మ పాడినట్టి జోల పాటలు పదిలం.. అంటూ పాడిన గజల్ విశేషంగా ఆకట్టుకుంది. అలాగే "చేదుకుంటే బావినీరు చెడిపోతుంది", "సుఖమైనా దుఃఖమైనా ఒక్కటే నా భావన.. గెలుపైనా ఓటమైనా ఒక్కటే నా సాధన" వంటి గజల్స్‌ను భావయుక్తంగా ఆలపించింది. విశాఖ బీచ్‌లో 1995లో డా. సి. నారాయణరెడ్డి రచించిన "ఎన్నో దాహాలుంటాయి.. కొన్ని తీరతాయి, కొన్ని తీరవు" గజల్‌ను ప్రస్తావిస్తూ సంస్కృతి ఆలపించిన తీరు శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంది. చివరగా గోదావరి, పాపికొండల అందాలను ప్రతిబింబించే గజల్‌ను శ్రావ్యంగా ఆలపించి ప్రశంసలు అందుకుంది. డా. కె.జి. వేణు, నర్సింగరావు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమం అనంతరం ప్రసాదాల పంపిణీతో కార్యక్రమం ముగిసింది.



## అనధికార బాణాసంచా తయారీ నిలవలపై కఠిన చర్యలు

**అనకాపల్లి జయ జయహే**

జిల్లా వ్యాప్తంగా అనుమతి లేని బాణాసంచా తయారీ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హెచ్చరిస్తూ పోలీస్ అధికారులను అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోమని వారికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది గతంలో పలు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల ప్రాణ ఆస్తి రక్షణ ధ్యేయంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక మెగా ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లోనూ అధికారులు తమ పరిధిలోని బాణాసంచా తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అనుమతి పొందిన బాణాసంచా తయారీ కేంద్రాల భద్రత ప్రమాణాలు పాటించాలి అని తయారుచేంద్రాలో అగ్నిమాపక నివారణ పరికరాలు మీరు ఇసుక వంటి భద్రత నిబంధనల ప్రకారం ఉన్నాయో లేదో పరిశీలించాలని అలాగే ఎలాంటి అనుమతి లేని బాణాసంచా తయారీ లేదా నిల్వ కేంద్రాలు ఉన్నట్లయితే గుర్తించి అవి పని చేయకుండా క్షేత్రస్థాయిలో విచారించి సరిచూసుకోవాలని నిబంధనలు ముల్లంగించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు ప్రభుత్వం అనుమతి పొందిన ప్రదేశాల్లో మాత్రం నిర్ణీత పరిమితికి లోబడి తయారీ నిల్వ సరి చూడాలని మైనర్లను నైపుణ్యం లేని వారిని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని కేవలం శిక్షణ అనుభవం ఉన్న వ్యక్తులతోనే ఈ పనులు చేయించాలని నివాస ప్రాంతాలు జన సామర్థ్యం ఉన్న ప్రదేశాల లో బాణాసంచా తయారీ లేదా భారీ నిల్వలు పూర్తిగా నిషేధం ఉన్నదని తయారీ ప్రదేశాల వద్ద విద్యుత్ వాలి సురుక్షేత్రంగా ఉండాలని ఎలాంటి ధూమపానం లేదా మండే పదార్థాలను అక్కడ అనుమతించకూడదని పరిసర ప్రాంతాల్లో అనుమతి లేకుండా బాణాసంచ తయారు చేస్తున్న అక్రమంగా నిల్వ ఉంచిన లేదా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని లేదా డైల్ 112 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి ప్రమాదాల నివారణకు తోడ్పడాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేయడం జరిగింది



## కర్ణాటక ఎమ్మెల్సీ సీటీ రవిని కలిసిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

**శ్రీకాళహస్తి జయ జయహే**

శ్రీకాళహస్తి కర్ణాటక ఎమ్మెల్సీ సీటీ రవిని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త బాలాజీ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ఈ భేటీలో పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ సీటీ రవితో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, బాలాజీ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## 25న శ్లోక పాకల 'కూచిపూడి' నాట్య రంగప్రవేశం

### యువ కూచిపూడి నర్తకి శ్లోక పాకల

**విశాఖపట్నం :(జయ జయహే)**



నగరానికి చెందిన యుక కూచిపూడి నర్తకి శ్లోక పాకల 'కూచిపూడి' నాట్య రంగప్రవేశం 25 వ తేది శుక్రవారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో జరుగనుంది. భారత్ నత్యోత్సవ్, వైశాఖి నత్యోత్సవ్ వంటి ప్రామాణికమైన జాతీయ, అంతర్జాతీయ నత్యోత్సవాల నిర్వహణతో నగర ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేస్తున్న ఐఎస్ఓ గుర్తింపు కలిగిన సంస్థ నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ప్రిన్స్‌పల్ నాట్యశ్రీ కేవీ లక్ష్మీ శుశ్రూషలో సుశిక్షితురాలైన శ్లోక గీతం డీమ్డ్ యూనివర్శిటీలో బి.టెక్ (సి.ఎస్.ఈ) చివరి సంవత్సరం విద్యార్థిని. అంతేకాకుండా ఆమె ఎన్‌సీసీ క్యాడెట్ చదువులోనూ ముందంజలో ఉంటుంది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనే సామెతకు ఆమె జీవితం అద్దం పడుతుంది. అతి పిన్న వయస్కురాలిగా బుడిబుడి అడుగుల నాడే శ్లోక నాట్యంలో ఓనమాలు దిద్దడం ఆరంభించారు. శాస్త్రీయ నత్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించారు. ఆమెది మూడు తరాల అనువంశిక వారసత్వం. తల్లి వైజయంతి పాకల 14 ఏళ్లపాటు నిరాఘాటంగా టేకుమళ్ల శ్యామల వద్ద కూచిపూడి నాట్యం నేర్చుకున్నారు. ఆమె అమ్మమ్మ శశికళ పెద్దాడ కూడా అంకితభావం కలిగిన కూచిపూడి నాట్యకారిణి. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించి యువ నాట్యకారిణి శ్లోకను ఆశీర్వదించడానికి దేశం నలుమూల నుంచి సంగీత నాటక అకాడెమీ అవార్డు, పద్మశ్రీ పురస్కార విజేతలైన ప్రఖ్యాత నర్తకీ విదుషీమణులు హాజరుకానున్నారు. మణిపురీ నాట్య శిఖరం డాక్టర్ దర్శనా ఝవేరీ, డాక్టర్ కళా క్రిష్ణ , కళారత్న హరి రమమమూర్తి, తదితరులు రానున్నారు. దేశంలో పేరెన్నికగన్న నత్యోత్సవ నిర్వాహకులు సాయి వెంకటేష్, అనుపమా మోహన్, డాక్టర్ పి. రమాదేవి, డాక్టర్ సజనీ వల్లభనేని, చిత్రా సుకుమారన్, ఎం. భారతి, ప్రొఫెసర్ సుదీప్త, రైటర్స్ అకాడెమీ ఛైర్మన్ వి.వి. రమణ మూర్తి అతిథులుగా పాల్గొంటారు. కళాప్రియుంతా సకాలంలో తమ మొబైల్ ఫోన్లను నిశ్శబ్ధంలో ఉంచి ప్రదర్శనకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని ఎన్ఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షులు ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల సాంస్కతిక మాసపత్రిక సంపాదకులు బిఆర్ విక్రమ్ కుమార్ సూచించారు.



## ఘనంగా సరస్వతి పూజ

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు రజక వీధిలో నిడదవోలు పట్టణ రజక జన సేవా సంఘం, డైమండ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన్నారుల కోసం ప్రత్యేకంగా సరస్వతి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు భక్తిశ్రద్ధలతో సరస్వతి దేవిని ఆరాధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్య, జ్ఞానం, విజ్ఞానం ప్రసాదించాలని, చిన్నారులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని అమ్మవారిని ప్రార్థించారు. పుస్తకాలు, పలకలు తదితర విద్యా సామగ్రిని అమ్మవారి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించారు. సరస్వతి పూజలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో రజక వీధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిడదవోలు పట్టణ రజక సేవా సంఘం, డైమండ్ యూత్ ఆధ్వర్యంలో వివిధ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, భక్తులు, నిడదవోలు పట్టణ రజక జన సేవా సంఘం సభ్యులు, డైమండ్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మధురవాడ ఈఈగా పోలాకి బాధ్యతల స్వీకరణ

### ఘనంగా అభినందించిన విద్యుత్ కార్మిక సంఘం నాయకులు

**మధురవాడ, సెప్టెంబర్ 20, జయ జయహే**

ఈపీడీసీఎల్ జోన్-3 కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పోలాకి శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ జోన్ 1 ఈఈగా ఉన్న ఈయన్ను ఖాళీగా వున్న మధురవాడకు బదిలీ చేస్తూ సీఎండీ పృధ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఈపీడీసీఎల్ డిస్కం అధ్యక్షుడు బి.ఎం. నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు



మాట్లాడుతూ విద్యుత్ శాఖలో విధుల పట్ల అంకితభావంతో, ఉ ద్యోగులు-వినియోగదారుల సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో పనిచేసే అధికారిగా పోలాకి శ్రీనివాసరావుకు మంచి గుర్తింపు ఉ ఒదన్నారు. ఆయన అనుభవం, సమర్థవంతమైన పరిపాలనా నైపుణ్యాలతో జోన్-3 మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. డిస్కం అధ్యక్షుడు బి.ఎం. నాయుడు మాట్లాడుతూ నూతన బాధ్యతల్లో పోలాకి శ్రీనివాసరావు నాయకత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఉద్యోగుల సంక్షేమం, విద్యుత్ సేవల మెరుగుదల కోసం అవసరమైన సహకారాన్ని సంఘం తరఫున ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయంతో పనిచేస్తే ప్రజలకు మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించవచ్చన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన పోలాకి శ్రీనివాసరావుకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయన గత సేవలు, విధి నిర్వహణలో చూపిన నిబద్ధతను కొనియాడారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించడంలో ముందుండే అధికారిగా ఆయనకు ఉన్న గుర్తింపు జోన్-3లో కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, విశాఖపట్నం ప్రాంతీయ కార్యదర్శి వేదుల నగేష్, ప్రాంతీయ అధ్యక్షుడు ఆర్.ఆర్. మూర్తి, సీనియర్ నాయకులు ఐ. మధుసూదన్, కె. నాయుడు బాబు, గవర వెంకటరావు, సుదర్శన్‌రావు, ప్రాంతీయ కార్యవర్గ సభ్యులు వి.వి.ఎస్.ఎస్.డి. ప్రసాద్, గొలగాని రమణ, షినగం పాపునాయుడు, జోన్-3 నాయకులు మజ్జి నర్సింగరావు, కిషోర్‌కుమార్, కుసుమంచి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ వేదిక ఎక్కిన గంటా మనవడు జిష్ణు ఆర్యన్

### తొమ్మిదేళ్లకే అంతర్జాతీయ వేదికపై తొలి ప్రసంగం

### ఓటమిని అధిగమించి ముందుకు సాగాలంటూ సందేశం

**ఆక్స్‌ఫర్డ్, సెప్టెంబర్ 20, జయ జయహే**



గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించిన తొమ్మిదేళ్ల గంటా జిష్ణు ఆర్యన్ ఆక్స్‌ఫర్డ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆలోచనా వేదికపై తొలిసారి ప్రసంగించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మనవడైన జిష్ణు.. ఇప్పటికే స్వర్ణ నిష్పత్తిలోని 216 దశాంశ స్థానాలను నిమిషంలోపు చెప్పి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించాడు. 'మీరు ఎటు వెళు న్నారు?' అనే ఇతివృత్తంతో జరిగిన కార్యక్రమంలో జిష్ణు తన జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, భయాలు, ఓటములను అధిగమించి తన దారిని తానే ఎంచుకోవాల్సిన అవసరాన్ని వివరించాడు. ఫుట్‌బాల్‌పై తనకున్న ఆసక్తిని ప్రస్తావిస్తూ.. పడిపోయినా, బాధపడినా తిరిగి లేచి ముందుకు సాగాలనే స్ఫూర్తిదాయక సందేశాన్ని తనదైన శైలిలో వినిపించాడు. చిన్న వయసులోనే ఆత్మవిశ్వాసం, పట్టుదల, లక్ష్యసాధనపై జిష్ణు చేసిన ప్రసంగం సభికులను ఆకట్టుకుంది. తన తల్లి షరణి పొంగూరుతో కలిసి ఒకే అంతర్జాతీయ వేదికను పంచుకోవడం మరో విశేషంగా నిలిచింది. నారాయణ సంస్థల నిర్వాహకులు గంటా రవితేజ, షరణి పొంగూరు దంపతుల కుమారుడైన జిష్ణు.. కుటుంబ వారసత్వంతో పాటు తనకంటూ ప్రత్యేక ఆసక్తులు, ప్రతిభతో ముందుకు




## రూ.3.49 లక్షలకు వినాయకుడి లడ్డూ వేలం

**నాయుడుపేట, సెప్టెంబర్ 20, జయ జయహే**

నాయుడుపేట పట్టణంలోని దర్గా వీధిలో ఎస్.జె. జువెలరీ రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 25 అడుగుల భారీ వినాయక విగ్రహానికి ఏడు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 20 కేజీల భారీ లడ్డూకు నిర్వహించిన బహిరంగ వేలంలో ఆవుల సుధాకర్ రూ.3,49,000లకు దక్కించుకున్నారు. అనంతరం బాణసంచా, డీజే సౌండ్‌ల నడుమ గణనాథుడి శోభాయాత్రను ఘనంగా నిర్వహించి, విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ వెంకటేశ్వర్లుతో పాటు భక్తులు, స్థానికులకు రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

For a pure tomorrow.. జయహో



# హోరెత్తిన పంచగ్రామాల గ్రామ సభ

### ఆక్రమణదారులం కాదు, హక్కుదారులం

### మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో 'ఐక్య కార్యాచరణ కమిటీ'

**అడివివరం, సెప్టెంబర్ 20, జయ జయహే**

సింహాచల పంచగ్రామాల పరిధిలోని అడివివరం గ్రామంలో గత 30 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యపై ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. గత మూడు దశాబ్దాలుగా ఎవరూ నిర్వహించని రీతిలో, రాజకీయ పార్టీల విభేదాలను పక్కనపెట్టి కేవలం గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జరిగిన ఈ సభకు అడివివరం గ్రామ ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి పాశర్ల ప్రసాద్ మాట్లాడుతూ, తరతరాలుగా ఈ భూములను సాగు చేసుకుంటూ ఇళ్లలో నివసిస్తున్న అడివివరం ప్రజలను 'ఆక్రమణదారులు'గా చూడటం తగదని, తామంతా న్యాయబద్ధమైన హక్కుదారులమని స్పష్టం చేశారు. మూడు దశాబ్దాలుగా పాలకులు మారుతున్నా పంచగ్రామాల ప్రజల కష్టాలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్రామ కంఠాల భూములను నిషేధిత జాబితా నుంచి పూర్తిగా తొలగించి, స్థానిక ప్రజలకు పూర్తి స్థాయి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గత 30 ఏళ్లుగా గ్రామంలో ఇటువంటి గ్రామసభలను నిర్వహించుకోకపోవడం వల్ల ప్రజలు తమ హక్కులకు సంబంధించిన ఎన్నో కీలక అంశాలను విస్మరించే పరిస్థితి ఏర్పడిందని సభలో పాల్గొన్న పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, ఈ గ్రామసభ వేదికగా ప్రత్యేక సమన్వయ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ద్వారా ప్రభుత్వంలోని మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, కూటమి ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు మరియు దేవాదాయ శాఖ కమిషనర్‌లకు నేరుగా వినతిపత్రాలు అందజేసి ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. అవసరమైతే సమగ్ర చట్టపరమైన కార్యాచరణ రూపొందించి, న్యాయస్థానాల ద్వారా సంపూర్ణ హక్కులు సాధించేవరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ పోరాటానికి, కమిటీ కార్యకలాపాలకు అండగా నిలుస్తూ అడివివరం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ కర్రి అప్పలస్వామి రూ. లక్ష విరాళంగా అందజేసి తన సంపూర్ణ సహకారాన్ని ప్రకటించారు. పార్టీల రంగులను పక్కనపెట్టి కేవలం గ్రామాభ్యుదయమే ధ్యేయంగా జరిగిన ఈ మహాసభలో భీమిలి మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, అడివివరం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ కర్రి అప్పలస్వామి, స్థానిక సీనియర్ నాయకులు గుసిడి శంకర్ రావు, బీజేపీ వార్డు అధ్యక్షులు వర్మ, వైఎస్సార్సీపీ వార్డు అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు, లంక సత్తిబాబు, లండ రాంబాబు, కోరాడ అచ్యుతరావు, సిరిపురం సురేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అడివివరం ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఏర్పాటైన కమిటీకి అందరూ ముక్తకంఠంతో సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సాగుతున్నాడు. తాత గంటా శ్రీనివాసరావు మాజీ మంత్రిగా, భీమిలి ఎమ్మెల్యేగా కొనసాగుతుండగా, మరో తాత పొంగూరు నారాయణ కూడా రాష్ట్ర మంత్రిగా వున్నారు. గిన్నిస్ ప్రపంచ రికార్డుతో ఇప్పటికే గుర్తింపు పొందిన జిష్ణు.. తాజాగా ఆక్స్‌ఫర్డ్ వేదికపై తొలి ప్రసంగంతో తన ప్రయాణంలో మరో మైలురాయిని చేరుకున్నాడు.

# నకిలీకి కొత్త ముఖం.. కొత్త స్వరం!

### డీప్‌ఫేక్‌లతో విశ్వాసానికి పెరుగుతున్న ముప్పు

### డిజిటల్ ప్రపంచంలో వాస్తవానికి ధ్రువీకరణ తప్పనిసరి!

**(ప్రతాప్)**



ఒక వీడియోలో ఒక ప్రముఖుడు మాట్లాడుతున్నాడు. స్వరం అతనిదే. ముఖ కవళికలు సహజంగానే ఉన్నాయి. పెదవుల కదలికలు మాటలకు సరిగ్గా సరిపోతున్నాయి. చూస్తున్నవారికి అనుమానం రావాల్సిన కారణమే కనిపించదు. కానీ ఆ వీడియోలోని ప్రతి మాట కృత్రిమంగా సృష్టించబడినదై ఉండొచ్చు. ఇదే డీప్‌ఫేక్ యుగం మన ముందుంచుతున్న అసలు సవాలు. నిజాన్ని నకిలీగా తయారు చేయడం కంటే, నకిలీని నిజమని నమ్మించడం సులభమవుతున్న ప్రపంచం మరింత ప్రమాదకరం.

ఈ ప్రమాదం ఎంత వేగంగా పెరుగుతోందో తాజా పరిశోధనలు చెబుతున్నాయి. సెప్టెంబర్ 2026లో విడుదలైన డీఎఫ్26 పరిశోధనలో 271 నిజమైన వీడియోలు, 2,420 కృత్రిమ వీడియోలను పరీక్షించారు. ఏడు ఆధునిక వీడియో సృష్టి నమూనాలతో తయారైన ఈ కృత్రిమ వీడియోలను మనుషులు గుర్తించడమే కాకుండా, అత్యాధునిక డీప్‌ఫేక్ గుర్తింపు వ్యవస్థలు కూడా గుర్తించడంలో యాదృచ్ఛిక అంచనాకు దగ్గరగా పనితీరు చూపినట్లు పరిశోధకులు నివేదించారు. అంటే కృత్రిమ వీడియోలు మరింత సహజంగా మారుతున్న కొద్దీ కేవలం కళ్లను నమ్మడం సరిపోదన్నమాట.

ఇది కేవలం వినోద ప్రపంచానికి సంబంధించిన సమస్య కాదు. ఒకరి స్వరాన్ని అనుకరించి కుటుంబ సభ్యుడి నుంచి డబ్బు అడగవచ్చు. ఒక వ్యాపారవేత్త పేరుతో నకిలీ ఆదేశాలు పంపవచ్చు. ఒక ఉద్యోగి ముఖాన్ని ఉపయోగించి డిజిటల్ గుర్తింపు ప్రక్రియను మోసం చేయవచ్చు. నకిలీ వీడియోలతో వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీయవచ్చు. తప్పుడు సమాచారం వేగంగా వ్యాపించవచ్చు. అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టాండర్డ్స్ అండ్ టెక్నాలజీ కూడా సింథటిక్ కంటెంట్ వల్ల సమాచార విశ్వసనీయత దెబ్బతినడం, మోసం, వ్యక్తిత్వ దుర్వినియోగం వంటి ప్రమాదాలు ఉన్నాయని గుర్తించింది.

ఇక్కడ మరింత లోతైన ప్రమాదం ఉంది. రేపు ఒక నిజమైన వీడియో బయటకు వచ్చినప్పుడు కూడా "ఇది ఏఐతో తయారై ఉండొచ్చు" అని చెప్పి దాన్ని తిరస్కరించే పరిస్థితి ఏర్పడితే? దీనినే సమాచార ప్రపంచంలో లయర్స్ డివిడెండ్‌గా భావిస్తారు. నకిలీ సమాచారంతో నిజాన్ని దాచడం మాత్రమే కాదు.. నిజాన్ని కూడా నకిలీగా అనిపించేలా చేయడం. అప్పుడు సమస్య ఒక వీడియోకు పరిమితం కాదు. సమాజం తన కళ్లను, చెవులను, చివరకు సమాచార వ్యవస్థలనే నమ్మలేని స్థితికి చేరుతుంది.

అందుకే పరిష్కారం కేవలం డీప్‌ఫేక్ గుర్తించే ఒక సాఫ్ట్‌వేర్ కోసం వెతకడంలో లేదు. సాంకేతికతను బహుళస్థాయిలో ఉపయోగించాలి. కంటెంట్ ఎక్కడ, ఎప్పుడు, ఏ పరికరంతో రూపొందిందో నమోదు చేసే డిజిటల్ ప్రొవెనెన్స్, కంటెంట్‌లో మార్పులను గుర్తించే మెటాడేటా, డిజిటల్ వాటర్‌మార్క్‌లు, క్రిప్టోగ్రాఫిక్ ధ్రువీకరణ, కృత్రిమ కంటెంట్ గుర్తింపు వ్యవస్థలు---ఇవన్నీ కలిసి పనిచేయాలి. నిస్ట్ కూడా సింథటిక్ కంటెంట్‌కు సంబంధించి ప్రొవెనెన్స్, వాటర్‌మార్కింగ్, గుర్తింపు వంటి పద్ధతులను కీలక సాంకేతిక మార్గాలుగా గుర్తించింది. అయితే వాటర్‌మార్క్‌లు, మెటాడేటాను కూడా తొలగించే అవకాశం ఉండటంతో ఒక్క పరిష్కారంపై ఆధారపడటం సరిపోదని అదే సంస్థ హెచ్చరిస్తోంది.

ఇక్కడ మానవ జాగ్రత్తకు కూడా సాంకేతికతంతే ప్రాధాన్యం ఉంది. అత్యవసరంగా వచ్చిన స్వరం, వీడియో, సందేశాన్ని వెంటనే నమ్మకూడదు. బ్యాంకింగ్, డిజిటల్ గుర్తింపు వంటి కీలక వ్యవస్థల్లో ఒకే ముఖం లేదా స్వరాన్ని ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకుండా బహుళస్థాయి ధ్రువీకరణ అవసరం. నిస్ట్ తాజా డిజిటల్ గుర్తింపు మార్గదర్శకాల్లో కూడా కృత్రిమంగా మార్చిన మీడియాను గుర్తించడానికి ఆటోమేటెడ్ విశ్లేషణతో పాటు మానవ పర్యవేక్షణ అవసరమని పేర్కొంది.

అయితే ఏఐని శత్రువుగా చూడటం పరిష్కారం కాదు. అదే సాంకేతికత నకిలీ కంటెంట్‌ను సృష్టించగలిగితే, దాని మూలాన్ని ధ్రువీకరించడంలో, అనుమానాస్పద కంటెంట్‌ను గుర్తించడంలో, సైబర్ మోసాలను అడ్డుకోవడంలో కూడా ఉపయోగపడుతుంది. అవసరమైనది సాంకేతికతపై భయం కాదు---సాంకేతికతకు బాధ్యతను జోడించే వ్యవస్థ.

డీప్‌ఫేక్‌ల యుగంలో అసలు పోరాటం నిజం--అబద్ధం మధ్య మాత్రమే కాదు. విశ్వాసం--అనుమానం మధ్య కూడా. రేపటి డిజిటల్ ప్రపంచంలో "నేను చూశాను కాబట్టి నిజమే" అనే నమ్మకం పనిచేయదు. "ఇది ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సృష్టించారు? మూలం ధ్రువీకరించబడిందా? మరొక స్వతంత్ర ఆధారం ఉందా?" అనే ప్రశ్నలు సమాచార వినియోగంలో సాధారణ అలవాటుగా మారాలి.

కృత్రిమ మేధస్సు నకిలీ ముఖాన్ని సృష్టించగలదు.. నకిలీ స్వరాన్ని సృష్టించగలదు.. చివరికి నకిలీ వాస్తవాన్నీ సృష్టించగలదు. కానీ సమాజం నిజాన్ని గుర్తించే సామర్థ్యాన్ని కోల్పోతే, అది సాంకేతిక వైఫల్యం కాదు---సామాజిక వైఫల్యం. అందుకే డీప్‌ఫేక్‌లను అడ్డుకోవడం అంటే కేవలం నకిలీ వీడియోలను తొలగించడం కాదు; నిజమైన సమాచారానికి డిజిటల్ ధ్రువీకరణ, పారదర్శకత, బాధ్యత అనే కొత్త రక్షణ కవచాన్ని నిర్మించడం. రేపటి ప్రపంచంలో అత్యంత విలువైన డిజిటల్ ఆస్తి డేటా కాదు.. వేగం కాదు.. ఏఐ సామర్థ్యం కూడా కాదు. నిజాన్ని నిజమని నిరూపించగల విశ్వసనీయతే.

# యూపీఐపై కొత్త ఛార్జీలు.. ఎవరి భారం ఎంత?

### డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు కొత్త ఆర్థిక నమూనా

**(ప్రతాప్)**




భారతదేశ డిజిటల్ చెల్లింపుల విప్లవానికి ప్రతీకగా నిలిచిన యూపీఐ వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. అక్టోబర్ 15, 2026 నుంచి ₹2,000కు మించిన కొన్ని వ్యాపారి చెల్లింపులపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ అమల్లోకి రానుంది. అయితే దీనిని యూపీఐ పన్నుగా భావించడం సరికాదు. ఇది ప్రభుత్వానికి వినియోగదారుల నుంచి వసూలు చేసే పన్ను కాదు; చెల్లింపుల వ్యవస్థలోని బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, యూపీఐ అనువర్తనాల మధ్య పంచబడే రుసుము.

అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే వ్యక్తి నుంచి వ్యక్తికి చేసే యూపీఐ బదిలీలపై ఎలాంటి రుసుమూ ఉండదు. స్నేహితుడికి డబ్బు పంపినా, కుటుంబ సభ్యుడికి బదిలీ చేసినా, మొత్తం ఎంతైనా ఈ రుసుము వర్తించదు. అలాగే వ్యాపారులకు చేసే ₹2,000 వరకు చెల్లింపులు కూడా రుసుము లేకుండానే కొనసాగుతాయి. ప్రభుత్వ సమాచారం ప్రకారం, వ్యాపారి చెల్లింపుల్లో సుమారు 96 శాతం ఈ కొత్త రుసుము పరిధిలోకి రావు.

అయితే ₹2,000కు మించిన నిర్దిష్ట వ్యక్తి నుంచి వ్యాపారికి జరిగే లావాదేవీలపై 0.4 శాతం రుసుము వర్తిస్తుంది. ₹75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు ఈ రుసుము ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా ₹300గా పరిమితం చేశారు. ఉదాహరణకు ₹10,000 చెల్లింపుపై 0.4 శాతం అంటే ₹40. ₹50,000పై ₹200. ₹1 లక్ష చెల్లింపుపై శాతం ప్రకారం ₹400 వచ్చినప్పటికీ గరిష్ఠ పరిమితి కారణంగా ₹300కే పరిమితం అవుతుంది.

చిన్న వ్యాపారులకు మాత్రం ప్రత్యేక రక్షణ కల్పించారు. యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా నెలకు ₹1 లక్ష వరకు స్వీకరించే అర్హత కలిగిన చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు, స్థానిక దుకాణాలు జీరో ఎండీఆర్ ప్రయోజనం కొనసాగించనున్నాయి. అంటే ఈ మార్పు ప్రతి దుకాణదారుడిపై ఒకే విధంగా ప్రభావం చూపదు.

కొన్ని అత్యవసర, తక్కువ లాభ మార్జిన్ రంగాలకు కూడా ప్రత్యేక రేటు ఉంది. రైల్వేలు, టెలికాం, బీమా, ఇంధనం, వ్యవసాయ ఇన్‌పుట్‌ల వంటి రంగాల్లో ₹2,000కు మించిన లావాదేవీలకు ఒక్కో లావాదేవీకి ₹5 స్థిర రుసుముగా నిర్ణయించారు. మూలధన మార్కెట్‌కు సంబంధించిన మ్యూచువల్ ఫండ్లు, సెక్యూరిటీలు, స్టాక్ బ్రోకర్లు, డీలర్ల చెల్లింపులకు 0.02 శాతం, ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా ₹300 పరిమితి ఉంటుంది.

మరి వినియోగదారులపై ప్రభావం ఏమిటి? ప్రత్యక్షంగా చూస్తే పెద్ద మార్పు లేదు. బ్యాంకులు వ్యాపారులు ఈ రుసుమును వినియోగదారులపై మోపకుండా చూడాలని సూచించబడింది. యూపీఐ అనువర్తనాలు కూడా అదనపు వేదిక రుసుములు లేదా దాచిన ఛార్జీలు విధించకూడదని స్పష్టం చేశారు. అయితే పరోక్ష ప్రభావాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. అదనపు వ్యయాన్ని భరించే కొందరు వ్యాపారులు ధరలను సవరించే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

వ్యాపారుల దృష్టిలో ఇది మాత్రం కొత్త వ్యయ అంశం. ముఖ్యంగా తక్కువ లాభ మార్జిన్‌తో పనిచేసే పెద్ద లావాదేవీల వ్యాపారాలపై ప్రభావం ఉండవచ్చు. మరోవైపు, యూపీఐ మౌలిక సదుపాయాలు, భద్రత, సాంకేతిక అభివృద్ధి, బ్యాంకులు మరియు చెల్లింపు సంస్థల నిర్వహణకు నిరంతర ఆదాయ నమూనా అవసరమనే వాదన కూడా ఉంది. ప్రభుత్వం ఈ మార్పును యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలికంగా స్వయం-స్థిరంగా కొనసాగేందుకు ఉద్దేశించిన చర్యగా వివరిస్తోంది.

యూపీఐ భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, చెల్లింపుల సౌలభ్యం, చిన్న వ్యాపారుల ప్రయోజనాలు, వినియోగదారులపై ధరల ప్రభావం, చెల్లింపుల వ్యవస్థ ఆర్థిక స్థిరత్వం మధ్య సమతుల్యతే ముందున్న అసలు సవాలు. యూపీఐకి ఛార్జీ వచ్చిందా లేదా అన్న దానికంటే, ఈ కొత్త రుసుము వ్యవస్థ పారదర్శకంగా అమలవుతుందా, వ్యాపారులపై భారం ఎంతవరకు పడుతుంది, వినియోగదారులకు పరోక్ష వ్యయం ఏర్పడుతుందా అన్నదే భవిష్యత్తులో గమనించాల్సిన అంశం.




### నీలకంఠాపురం గ్రామంలో

# పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమం

**బుచ్చియ్యపేట జయ జయహే**

అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా, ఐ పి ఎస్ వారి ఆదేశాల మేరకు, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం నీలకంఠాపురం గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ప్రజలుతో సమావేశం, నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యస్ ఐ పి. మనోజ్ కుమార్ మాట్లాడుతూ అభయ,మహిళల భద్రత, సంకల్పం, మాదకద్రవ్యాల నిర్మూలన, మహిళలు మరియు బాలల రక్షణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పోలీసు అధికారులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని, వారి సమస్యలు, భద్రతకు సంబంధించిన ఇబ్బందులు మరియు ఇతర ఫిర్యాదులను స్వయంగా తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని నమోదు చేసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పోలీసు అధికారులు గ్రామంలో విస్తృతంగా పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలు మరియు ముఖ్యమైన ప్రదేశాలను పరిశీలించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా, ప్రజలందరూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసే వారికే టికెట్....

# వ్యక్తుల కోసం పనిచేస్తే టికెట్ ఉండదు

### ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

### ఏకతాటిపై నడిస్తేనే స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తాం

**ముంచంగిపుట్టు, జయ జయహే :**




రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమష్టిగా సన్నద్ధం కావాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకే ప్రాధాన్యత ఉంటుందని, వ్యక్తుల కోసం పనిచేసే వారికి టికెట్ ఉండదని స్పష్టం చేశారు.ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని జడ్పీ చైర్‌పర్సన్ సమావేశ భవనంలో మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆధ్వర్యంలో మండల స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, బూత్ కమిటీల పటిష్టతతో పాటు నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా, నియోజకవర్గ స్థాయి సమావేశాలు పూర్తయ్యాయని, ప్రస్తుతం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఏకతాటిపై నడవాలని సూచించారు.ఒకే స్థానానికి పలువురు పోటీ చేయడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని, అందరినీ సమన్వయం చేసి ఒక్క అభ్యర్థిని ఏకాభిప్రాయంతో ఎంపిక చేయాలని అన్నారు. అభ్యర్థుల ఎంపికలో గ్రామ, మండల కమిటీలు సమిష్టిగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు.వ్యక్తిగత, కుటుంబ బంధాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ముందుకు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పార్టీతో కలిసి పనిచేయకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే వారికి టికెట్ ఇవ్వబోమని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో మంజూరైన రోడ్లను ప్రస్తుతం 'అడవి తల్లి బాట' పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ప్రతి కార్యకర్తకు పార్టీ ఐడీ కార్డు ముఖ్యమైనదని, గుర్తింపుతో పాటు రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. కార్డులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు.ముంచంగిపుట్టు మండలంలో 47 బూత్‌లు ఉన్నాయని, బూత్ స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలని అన్నారు. ఓటరు జాబితాలను పరిశీలించి మరణించిన, వలస వెళ్లిన వారి పేర్లను సరిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా సిద్ధం చేయాలని, గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకమై పార్టీ విధానాలను వివరించాలని పిలుపునిచ్చారు.అనంతరం నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఐడీ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, జేసీఎస్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ అరబీర జగబంధు, సుజనకోట ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మి, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు వెంగడ రమేష్, మండల ప్రధాన కార్యదర్శి ముక్కి రాంప్రసాద్‌తో పాటు మాజీ ఎంపీటీసీ గాసిరామ్, ఎండి సులేమాన్, జయదేవ్, గంపరాయి రామ్మూర్తి, వెంగడ నానిబాబు, వంతల కొండలరావు, సుభాష్, మోదకొండ, అర్జున్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



### వ్యవస్థలను సమన్వయం చేయడంలో

# జర్నలిస్టుల పాత్ర అమోఘం

### జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్

**విజయనగరం జయ జయహే**

వాస్తవాలను వెలికితీసి వ్యవస్థలను సరైన మార్గంలో నడిపించడంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. సెప్టెంబరు 20న విజయనగరం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 27వ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వార్షిక మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూప్రజలను చైతన్యపరచడంలో మీడియా నిర్ణయాత్మక పాత్ర పోషిస్తోందన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలు, బెట్టింగ్, మద్యం దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన పెంచే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, రహదారి భద్రతపై పోలీస్ శాఖతో కలిసి జర్నలిస్టులు పనిచేయాలని కోరారు. అలాగే, జర్నలిస్టులపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టులకు త్వరలోనే క్యూఆర్ కోడ్‌తో కూడిన వెహికల్ పాస్‌లు అందజేస్తామని భరోసానిచ్చారు.



# అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**బుచ్చినాయుడు కండ్రిగ, సెప్టెంబర్ 20, జయ జయహే**

బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని భవానీ శంకరపురం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ ఐఏఎస్ అధికారి మేక సత్తిబాబు, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ద్వారా దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛ లభించాయని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు మండలాలకు చెందిన దళిత నాయకులు, ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు కయ్యూరి శివ, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



### హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో

# ఘనంగా అన్న సమారాధన

### అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

వినాయక చవితి సందర్భంగా ముంచంగిపుట్టులోని స్థానిక గిరిజన భవన్ సమీపంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ముందుగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గణనాథుని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హనుమాన్ యూత్ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్న సమారాధన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా సాగింది.



### పోలీస్ అధికారులు హెల్మెట్స్‌పై

# అవగాహన ర్యాలీ

**అరకులోయ: సెప్టెంబర్ 20. జయ జయహే.**

మండలంలోని సుంకరమెట్ట వారపు సంతలో వాహనాలు తనిఖీలు నిర్వహించి హెల్మెట్ పై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని అరకు సీఐ కోటేశ్వరరావు, ఎస్సై టీ మల్లేశ్వరరావు, నిర్వహించారు, హెల్మెట్ లేని వాహనదారులకు రోడ్డు యాక్సిడెంట్లు గురించి అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్క వాహనదారులు హెల్మెట్ ధరించాలని మీ ప్రాణాన్ని కాపాడుకోవాలని హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్య నేరమని తెలిపారు, ఎవరైనా హెల్మెంట్ ధరించకుండా వాహనాలు నడిపినట్లయితే అలాంటి వారిపై పోలీసు వారు చట్టపరమైన చర్యలు తీసుకుని వాహనదులపై ఎం.వి రూల్స్ ప్రకారం కేసులో పెట్టడం జరుగుతుందని తెలియజేశారు, దీనిలో భాగంగా హెల్మెట్ లేని వాళ్లకు ఫైన్లు విధిస్తూ హెల్మెంట్ వేసుకున్న వారికి అభినందించారు, వాహనదారు తో పాటు వాహనం లో వెనకాల కూర్చొని హెల్మెంట్ వేసుకున్న వాళ్లకు కూడా అభినందించారు, హెల్మెట్ లేని వాళ్లకు వాహనదారుల చేత కొత్త హెల్మెట్ కొనిపించి వాహదారులకు హెల్మెట్ పెట్టించే కార్యక్రమం చేపట్టారు, ప్రతి ఒక్క వాహన దారులు ఇలానే హెల్మెట్లు ధరించి మీ ప్రాణాన్ని రక్షించుకొండి మీ కుటుంబంతో ఆనందంగా జీవించండి అలానే ప్రతి ఒక్క వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని తెలియజేశారు ,ఈ కార్యక్రమంలో సిఐ రైటర్ వెంకటరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు ,



## గౌరీ పరమేశ్వరుల ఆలయ నిర్మాణానికి పెంటకోట విజయ్ దంపతులు విరాళం

**మునగపాక, సెప్టెంబర్ 20, జయ జయహే:**

మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో గౌరీయూత్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గౌరీపరమేశ్వరుల ఆలయ నిర్మాణానికి మండల టిడిపి అధ్యక్షుడు పెంటకోట విజయ్ మరియు స్వాతి దంపతులు 20వేల రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్ల వాళ్ళ వరాహ నర్సింగ రావు, గౌరీ యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం చేపట్టిన గౌరీయూత్ సభ్యులను పెంటకోట విజయ్ దంపతులు అభినందించారు.



### కరెంట్ బోరు మరమ్మతులు

# వెంటనే బాగు చెయ్యాలి

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 20. జయ జయహే.**

మండలం లోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో మరమ్మతులు గురైన కరెంటు బోరు వెంటనే బాగు చేచి త్రాగునీరు సౌకర్యం కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తామర్ల సూర్యనారాయణ డిమాండ్ చేశారు, అడపవలస గ్రామంలో అమర్చిన త్రాగునీరు కరెంటు బోరు మరమ్మతులు గురై 5రోజులు అవ్వుతున్నా సంబంధించిన అధికారులు స్పందింకపో వ్వడం తో నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాని తెలిపారు. అడపవలస గ్రామంలో సుమారు 70 కుటుంబాలు ఉన్నారని మరమ్మతులకు గురైన కరెంటు బోరు మిషన్ వెంటనే రిపేరు చేచి అడపవలసగ్రామంలో నెలన్న మంచినీటి సమస్య పరిష్కారం చేసి త్రాగునీరు సౌకర్యం కల్పించాలని ఆయన తెలిపారు. లేదంటే మండలప్రజాపరిత్ కార్యక్రమంలోఆందోళన ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలోమహిళా సంఘం నాయకులుతామర్ల. కుమారి.చెడ్డ.లక్ష్మి తామర్ల. ఈశ్వరమ్మ. కొర్ర.ఈశ్వరిచెడ్డ.మల్లమ్మ. తామర్ల. కలిమ్మా గ్రామ మహిళలు పాల్గొన్నారు.



### గంజాయి రహిత సమాజం

### కార్య చరణ అవగాహన

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 20, జయ జయహే.**

అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు చైతన్యం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బిట్రాగండ, బలియాగూడ, నందివలస, కోల్లాపుట్ పంచాయితీ గ్రామాలను డుంబ్రిగూడ పోలీస్ అధికారులు సందర్శించి స్థానిక ప్రజలతో యువకులతో గంజాయి రహిత సమాజం కోసం పోలీసులకు ప్రజలందరూ సహకరించాలని కోరుతూ గంజాయి నేరాలు పట్ల అవగాహన కల్పించడం అయినది, డ్రోన్ కెమెరాని ఎగురవేసి ఇదివరకు గంజాయి పండించిన ప్రాంతాలను సూక్ష్మంగా వెతకడం అయినది, ప్రజలందరూ సైబర్ నేరాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని, రానున్న గ్రామపంచాయతీ ఎంపీటీసీ ఎన్నికలను ఎటువంటి శాంతి భద్రతల విఘాతం కలిగించకుండా సామరస్య వాతావరణం లో నిర్వహించుకోవాలని అందుకు ఎలక్షన్స్ సిబ్బందికి ప్రజలందరూ సహకరించాలని చెప్పారు,



## గదబపాలెంలో జనసేన ఆధ్వర్యంలో అన్నసమారాధన

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 21,**

కొయ్యూరు మండలం గదబపాలెం పంచాయతీలో వినాయక చవితి సందర్భంగా జనసేన కార్యకర్తలు అన్నసమారాధన నిర్వహించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా గ్రామంలో భక్తులకు, స్థానికులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బిజెపిలో చేరికలు

## గిరిజనులు మార్పు కోరుకుంటున్నారు: మఠం శాంతకుమారి





**సీలేరు (జయ జయహే)**

సీలేరు లో అధికసంఖ్యలో అభిమానులు భారతీయ జనతా పార్టీలో ఆదివారం చేరారు. వారందరికీ భారతీయ జనతా పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షురాలు మఠం శాంత కుమారి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నిర్మాణం కోసం కృషి చేసే ప్రతి ఒక్కరికి తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పార్టీ బలోపేతం దిశగా ప్రతి ఒక్కరు పని చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీలేరు మండలం దారకొండలో మన ఊరు మన జెండా కార్యక్రమం అనంతరం బహిరంగ సభ మండల అధ్యక్షులు కాకురి శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ కార్యక్రమానికి విశాఖ డైరీ డైరెక్టర్ పిల్లా రమా కుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మఠం శాంతకుమారి మాట్లాడుతూ నరేంద్ర మోడీ అభివృద్ధిని చూసి గిరిజనలంతా మార్పును కోరుకుంటున్నారన్నారు. ఏడు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న ఆదివాసీలు ల ఈరోజు మార్పు కోరుకుంటున్నారన్నారు. ప్రతి గ్రామానికి నరేంద్ర మోడీగా రహదారుల నిర్మించడం పట్ల ప్రజలంతా ఆకర్షితులవుతున్నారని ఎన్నడూ లేని విధంగా వారికే సంక్షేమ పథకాలు అందిస్తుండటం పట్ల బీజేపీ పైన నరేంద్ర మోడీ పైన గౌరవం పెరుగుతుందన్నారు. అందుకే ఏడ దశాబ్దాల పాటు వివిధ పార్టీల పాలకులు గిరిజన పట్ల చూపులు నిర్లక్ష్య ధోరణిని వ్యతిరేకిస్తూ భారతీయ జనతా పార్టీకి దగ్గరవుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించాలని ఆకాంక్ష ప్రజల్లో పెరుగుతుందన్నారు. అందుకే ఈరోజు గ్రామ గ్రామన భారతీయ జనతా పార్టీలో చేరికలు పెరుగుతున్నాయని తెలిపారు. అడవి తల్లి బాట కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా ప్రతి గ్రామానికి అనుసంధాన రహదారుల నిర్మిస్తూ ఉండడం పై ఆదివాసీల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. దాంతోపాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మెడికల్ కళాశాల, పిఎం జన్ మన్, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలు గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి పుట్ట గంగయ్య , జిల్లా మహిళా మోర్చా అధ్యక్షులు కేజియా రాణి , ట్రైకార్ డైరెక్టర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూడా కృష్ణ రావు, సల్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కుడుముల వెంకట రమణ, జైతి ప్రభాకర్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెనుమాక రవికుమార్, మహిళా మోర్చా అధ్యక్షులు బేతాళ కేజియా రాణి, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు లకే అబ్బాయి దొర, జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు, కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షులు కదుల్లా శ్రీనివాస్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ పండ ఈశ్వరరావు, దుక్కేరి ప్రభాకర్, బోండ్ల చిరంజీవి,ఓబీసీ మోర్చ మండల అధ్యక్షులు సదరం మా రి బాబు, కిముడు మోదీ, భాస్కర్, ప్రభాస్, కార్య కర్తలు పాల్గొన్నారు.

# ఎంపీ రమేష్‌పై గుడివాడ అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

## తెలుగుదేశం పార్టీ డిమాండ్

**మాడుగుల సెప్టెంబర్ 20 జయ జయహే**




అనకాపల్లి పార్లమెంట్ సభ్యునిగా కోట్ల రూపాయలు నిధులతో అభివృద్ధి చేస్తున్న సీఎం రమేష్ పై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అనుచితమని వాటిని వెనక్కి తీసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ పి అప్పలరాజు, మండల పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సన్యాసిరావు, పి రమేష్ తదితరులు మాట్లాడుతూ గతంలో ఎంతో మంది నాయకులు వివిధ ప్రాంతాలను చూసి ఈ ప్రాంతంలో పోటీ చేసి గెలిచారని అన్నారు. ఈ ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ఎక్కడి నుంచైనా వచ్చి ఎక్కడైనా పోటీ చేయవచ్చని దాన్ని విమర్శించడం తగదన్నారు. అనకాపల్లి ఎంపీగా మాడల్ మండలానికి కోట్ల రూపాయలు మంజూరు చేసి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నారని అలాంటి వ్యక్తినీ విమర్శించడం వైసిపి వారికి తగదన్నారు. మరల ఇలాంటి వ్యాఖ్యలు చేయవద్దని సూచించారు. ఎంపీ పై అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**మాడుగులను కరువు ప్రాంతంగా ప్రకటించాలి**

సకాలంలో వర్షాలు కురవని నేపథ్యంలో ఎల్లీనో ప్రభావంతో మాడుగుల మండలంలో పంటలు లేకుండా పోయాయని తెలుగుదేశం పార్టీ వాపోయింది. ఎక్కడ కూడా నాట్లు లేవని, నాట్లు ఉన్నచోట పంట ఎండిపోయిందని కాబట్టి మాడుగుల ప్రాంతాన్ని కరువు మండలం గా ప్రకటించి ఈ ప్రాంత రైతాంగని నాదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**ఉపాధి పనులకు పది కోట్లు మంజూరు**

మాడుగుల మండలంలో ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు విభిజి రాంజీ పథకం కింద కోటి రూపాయలు ఎమ్మెల్యే బందర్ సత్యనారాయణ మూర్తి మంజూరు చేయించిన దేశ నాయకులు తెలిపారు. వీటిని 29 పంచాయతీల్లో ఎక్కడ రహదారులు కాలువ నిర్మించాలో పరిశీలించి అక్కడ పనులు చేపడతామని చెప్పారు. కాబట్టి ఏ గ్రామానికి రహదారులు కాలువలు కావాలో తెలియజేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు ఉ ఒడూరు దేముడు, ఎల్ కాశి బాబు, సన్యాసిరావు, మరువాడ ఈశ్వరరావు, వడ్డాది బాబు తదితరులు పాల్గొన్నారు.

# బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలి

## ఉత్తర 'స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 20, జయ జయహే :**



స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను సిద్ధం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మాధవదార,వుడా కోలని, గ్రాండ్ మిలాన్ ఫంక్షన్ హాల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గ "స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహ కార్యవర్గ సమావేశం" వైసీపీ విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన కన్నబాబు మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టకాలంలోనూ నిజాయితీగా నిలబడిన కార్యకర్తలు, నాయకులను అభినందించిన కన్నబాబు రాజకీయాల్లో పదవులు, హోదాల కంటే నిబద్ధత, వ్యక్తిత్వం, విశ్వసనీయత ఎంతో ముఖ్యమని అన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచిన కొంతమంది కార్పొరేటర్లు పార్టీ మారినప్పటికీ, తమ నిబద్ధతను కాపాడుకుంటూ నిలబడిన కార్పొరేటర్లను అభినందించారు. విశాఖపట్నంలో వైఎస్సార్‌సీపీ బలహీనంగా ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని పార్టీ శ్రేణులు వాస్తవాలతో తిప్పికొట్టాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి. ప్రతి డివిజన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి చర్చించి బలమైన అభ్యర్థుల జాబితాను రూపొందించాలని కన్నబాబు గారు సూచించారు. రిజర్వేషన్లు ప్రకటించిన అనంతరం సంబంధిత కేటగిరీలలో సమర్థులైన అభ్యర్థులను గుర్తించి ఎన్నికలకు సన్నద్ధం కావాలని తెలిపారు. గ్రామస్థాయి నుంచి నగరస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడానికి కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బలంగా నిలబడి పోరాటం చేసి అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం నిజాయితీగా పనిచేస్తున్న కార్యకర్తల వివరాలను పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో పనిచేసి పార్టీ బలోపేతానికి తోడ్పడాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులందరూ శక్తివంచన లేకుండా సిద్ధం కావాలి. ప్రతి డివిజన్ నుంచి ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల పేర్లను తీసుకుని, అందరితో చర్చించి పార్టీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్లడం జరుగుతుంది. ప్రతి వార్డు నుంచి మూడు పేర్లను పరిశీలించి, అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీ విజయానికి కృషి చేస్తాం. వ్యక్తిగత ప్రయోజనాలు, వ్యక్తిగత ద్వేషాలు, చిన్నచిన్న పొరపాట్లను పక్కనపెట్టి పార్టీ శ్రేణులందరూ ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు సతీష్ వర్మ,బాణాల శ్రీనివాసరావు,మాజీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,ప్రచార విభాగం జోన్-1 ప్రెసిడెంట్ జీవీ రవి రాజు తదితరులు పాల్గొన్నారు




# దళితులకు పూజల హక్కు కల్పించాలి

**తొట్టంబేడు, సెప్టెంబర్ 20, జయ జయహే**

తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో పోలేరమ్మ జాతరలో దళితులకు పూజలు నిర్వహించే అవకాశం కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. జాతరలో దళితులను పూజలకు దూరం చేస్తున్నారంటూ వచ్చిన ఆరోపణలపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్పందించి దళితులకు పూజల హక్కు కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సోమవారం చియ్యవరం గ్రామంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు రాజేంద్ర, పులి శ్రీకాంత్, చందమామల కోటయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య, మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




# నిత్యాన్నదాన పథకమునకు విరాళం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 20, జయ జయహే**

శ్రీకాళహస్తీశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి ఒంగోలుకు చెందిన సీతారామయ్య కుటుంబ సభ్యులు ఒకలక్ష నూట పదహారులు రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, సభ్యురాలు కుసుమకుమారికి దాతలు సమర్పించారు.దేవస్థానంలో నిరంతరం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దాత సీతారామయ్య కుటుంబ సభ్యులకు దేవస్థానం తరఫున చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, సభ్యురాలు కుసుమకుమారి కృతజ్ఞతలు తెలిపారు.




# నశాముక్త యువ-వికసిత్ భారత్ కోసం యువత సంకల్పం

**గుంటూరు, సెప్టెంబర్ 20: (జయ జయహే )**

నశాముక్త యువ -- వికసిత్ భారత్ 100 వారాల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రీయ సంకల్ప సమారోహ్ కార్యక్రమాన్ని గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాల లో నిర్వహించారు. మేరా యువ భారత్, గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు పాల్గొని నషా ముక్త సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని సంకల్పం చేశారు. నషా పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలని, తోటి యువతను కూడా చైతన్యపరచాలని కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేరా యువ భారత్, గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ, నషా ముక్త యువతే దేశ ప్రగతికి కీలక శక్తి అని పేర్కొన్నారు. యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్, నషా ముక్త జీవనం మరియు జీవన నైపుణ్యాలపై అవగాహన పెంపొందించడమే ఈ 100 వారాల కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని యువతలో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచడంతో పాటు ఆరోగ్యం, క్రీడలు, సానుకూల ఆలోచనలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎం. సంతోష్ కుమారి, మాట్లాడుతూ విద్యార్థులు నశా పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులు మరియు సమాజంలో నషా ముక్త జీవన విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో యువత నషా ముక్త ప్రతిజ్ఞ చేయడంతో పాటు సంతకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. నషా ముక్త భారత నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని పెంచే విధంగా చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై చలో ఢిల్లీ

**అనకాపల్లి జయ జయహే**

కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలపై డిసెంబర్ 1న చలో ఢిల్లీ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు పిలుపు ఆదివారం సీఐటీయూ అనకాపల్లి జిల్లా విస్తృత సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా జీతాలు పెంచడం లేదని బిజెపి ప్రభుత్వ విధానాలు వలన కార్మిక హక్కులు కాలరాస్తున్నయని కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చారని సేవారంగంలో పనిచేస్తున్న కార్మికులు, కార్మికులు కారని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని కార్మికుల జీతాలు పెంచలేని ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలు కి 18 లక్షల కోట్ల రూపాయలు రద్దు చేసిందని కూటమి ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని ధరల విపరీతంగా పెరిగాయని కార్మికుల ఆదాయాలు దిగజారుతున్నాయని కార్మిక సమస్యలపై డిసెంబర్ 1న చలో ఢిల్లీ కార్మికులు తరలిరావాలని దీనిపై ప్రతి కార్మికుడు కార్మికులను కలిసి విస్తృత ప్రచారం చేయాలని ఆయన




పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శేషు మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి జి వరలక్ష్మి ఐకెపి రాష్ట్ర అధ్యక్షురాలు సిహెచ్ రూపాదేవి ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే శాంతి సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ ఆర్ రాము అడిగర్ల రాజు ఎం రాజేష్ చంద్రశేఖర్ జి దేముడు నాయుడు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా శివపార్వతుల కళ్యాణం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని కందుకూరి వారి వీధిలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాలుగో సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ వినాయక స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. శివపార్వతుల కళ్యాణ వేడుకలతో కందుకూరి వారి వీధిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



### ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నం..

## విద్యుత్ షాక్‌తో ఇద్దరి మృతి

**గూడూరు రూరల్, సెప్టెంబర్ 20, జయ జయహే**

నెల్లూరు జిల్లా గూడూరు మండలం రామలింగాపురం గ్రామంలో అర్ధరాత్రి విషాద ఘటన చోటుచేసుకుంది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇద్దరు వ్యక్తులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి యత్నించే క్రమంలోనే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు.. ఇద్దరు వ్యక్తులు స్కూటీపై ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం వారు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు సమాచారం. మృతదేహాలను సమీపంలోని చెట్ల వద్ద ఉంచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో లభించిన స్కూటీ నంబర్‌ను పోలీసులు పరిశీలించగా, అది ఓజిలి మండలం సగుటూరు గ్రామానికి చెందిన ఓ మహిళ పేరుతో నమోదై ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న గూడూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతులు ఎవరనే విషయం, వారు ఎక్కడి నుంచి వచ్చారు, ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి నిజంగానే యత్నించారా, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే అంశాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### రైతు బకాయిలు చెల్లింపుకు

## సబ్ కమిటీ ఆమోదం

**చోడవరం సెప్టెంబర్ 20 జయ జయహే**

చోడవరం చక్కెర కర్మాగారానికి సంబంధించిన రైతుల బకాయిల సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభమయ్యాయి. సుమారు రూ.28 కోట్ల బకాయిలను చెల్లించేందుకు కేబినెట్ సబ్‌కమిటీ ఆమోదం తెలిపినట్లు చోడవరం జనసేన పార్టీ ఇన్‌చార్జి పీవీఎస్‌ఎన్ రాజు తెలిపారు.రైతులకు బకాయిలు చెల్లించాల్సిన అంశాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు రాజు పేర్కొన్నారు.గత నెలలో పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ ని కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. అలాగే ఇటీవల కె.కోటపాడు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసి చోడవరం చక్కెర కర్మాగారం రైతుల బకాయిల సమస్యను వివరించినట్లు రాజు తెలిపారు. అనంతరం ప్రభుత్వం కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కేబినెట్ సబ్‌కమిటీ సభ్యులు, పౌరసరఫరాల శాఖ



మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ శనివారం విశాఖపట్నం వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి బకాయిల అంశంపై చర్చించినట్లు రాజు తెలిపారు. ఈ సందర్భంగా సుమారు రూ.28 కోట్ల బకాయిల చెల్లింపునకు కమిటీ ఆమోదం తెలిపిందని, త్వరలోనే చెల్లింపులు జరుగుతాయని నాదెండ్ల మనోహర్ తెలిపినట్లు రాజు వెల్లడించారు.రైతుల బకాయిల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాదెండ్ల మనోహర్, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ కు పీవీఎస్‌ఎన్ రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంశంలో సహకరించిన ఎంపీ సి.ఎం. రమేష్, చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ కు ధన్యవాదాలు తెలిపారు.



## ఎన్నికల హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వం

**అనకాపల్లి జయ జయహే**

ధరలను నియంత్రించడంలో కూటమి ప్రభుత్వం యువకులమైందని సిపిఎం పార్టీ అనకాపల్లి మండల కన్వీనర్ గంట శ్రీరామ్ ప్రభుత్వం పై మండిపడ్డారు గవరపాలెం దెబ్బ వీధి అగ్గిమరిచెట్టు మార్కెట్ సంతోషిమాత గుడి ప్రాంతంలో ఇంటింటికి తిరిగి విస్తృతంగా కరపత్రాలను పంపిణీ చేయడం జరిగింది . ఈ సందర్భంగా గంట శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలలో ప్రతి 18 సంవత్సరాల నిండిన మహిళలకు నెలకు 1500 రూపాయలు ఇస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికి కూడా ఇవ్వకుండా మొండి చెయ్యి చూపిస్తున్నారని పట్టణ ప్రాంతాల్లో ఇల్లు లేని నిరుపేదలకు రెండు సెంట్లు స్థలం ఇల్లు నిర్మిస్తామని చెప్పి ఎంత వరకు ఒక ఇల్లు కూడా ఇవ్వలేదని ఫ్రీ బస్సు బస్సుల సర్వీసులను తగ్గించిందని మహిళల బస్సు సీట్ల కోసం యుద్ధాలు చేస్తున్నారని అటువంటి పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించిందని ఆయన విమర్శించారు ఇప్పటికైనా ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అన్నింటిని అమలు చేయాలని అర్హులైన వారందరికీ పెన్షన్లు ఇళ్ల స్థలాలు స్కీం ఇల్లు రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాళ్ళ తేలయ్య బాబు పౌరు సంక్షేమ సంఘం నాయకులు కొణతాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు

## భస్మ సహిత చందన అలంకరణలో స్వయంభూ

**చోడవరం సెప్టెంబర్ 20 జయ జయహే**

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చోడవరం స్వయంభూ శ్రీ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాలు లో ఆదివారం స్వామివారు బస్మ సహిత చందన అలంకరణ లో కార్యసిద్ధి గణపతిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి చందన పూజ, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భస్మ సహిత చందన వర్ణం లో గల స్వామివారిని అనేకమంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.అలాగే హోమం కూడా నిర్వహించారు.






### ఎంపీ సీఎం రమేష్‌పై

## గజారుడు వ్యాఖ్యలు తగవు

**డీసీఎంఎస్ చైర్మన్ కె బాలాజీ**

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ పై మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ నేత గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంపీపై అమర్నాథ్ జగజారుడు మాటలు మాట్లాడటం ఎంతవరకు సమంజస్మని ఇది ఎంత మాత్రం తగదని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు రాజకీయంలో విమర్శలు ప్రతి విమర్శలు నిర్మల నిర్మాణాత్మకంగా ఉండలా తప్ప వ్యక్తిగత దూషణలకు దిగజారుడు సరికాదని ఆయన పేర్కొన్నారు అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి కి ఎంపీ సీఎం రమేష్ ఎంతో శ్రమిస్తున్నారని అలాంటి నాయకుడిపై నిందలు వేయడం సమచితం కాదని ఆయన పేర్కొన్నారు మాజీ మంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన అమర్నాథ్ తమ పార్టీ ఉనికి కోసం రాజకీయ లబ్ధి కోసం తన గుర్తింపు కోసం ఎంపీ సీఎం రమేష్ పై ఆధారల్లేని ఆరోపణలు విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు ప్రతిపక్ష హోదా ఎలా ఉంటూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా కేవలం ప్రభుత్వంపై విమర్శలకి నాయకుల విమర్శలకు పరిమితమైన వీరికి మీరు పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన కూడా వీరు తీరు మారలేదని ఆయన ఘాటుగా విమర్శించారు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం మళ్లీ ఆసన్నమైందని ఆయన హెచ్చరించారు అనకాపల్లి జిల్లాలో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం ప్రాంతీయ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నదని ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఎటువంటి వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ ప్రజల దృష్టిని ఆలోచనను మళ్లించేందుకే ఇటువంటి కుట్రల కుతంత్రాలు పసలేని ఆరోపణలు చేస్తూ ఉంటారని బాలాజీ పేర్కొన్నారు ఎటువంటి ప్రయత్నాలు ఫలించవని నోటికి వచ్చినట్టు మాట్లాడటం మానుకొని సీఎం రమేష్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు మాజీ మంత్రి అమర్నాథ్ వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు

# కేజీబీవీ ఘటనలో బాధ్యులను గుర్తిస్తాం: గంటా

**భీమిలి, సెప్టెంబర్ 20: (జయ జయహే)**

కేజీబీవీ హైస్కూల్ లో నిద్రపోతున్న విద్యార్థినుల జుట్టు కత్తిరించిన ఘటనలో బాధ్యులని గుర్తిస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం కేజీబీవీని సందర్శించిన ఆయన సంఘటన గురించి పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఆరా తీశారు. పగడ్బందీ భద్రత ఉన్నందున బయట నుంచి ఎవరూ వచ్చే అవకాశం లేదని.. పాఠశాలలో ఉన్న వారే ఈ చర్యకు పాల్పడి ఉంటారనే ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. 4 రోజుల క్రితం చోటు చేసుకున్న విషయానికి ఇప్పుడు విస్తృత ప్రచారం కల్పించడం వెనుక ఎవరైనా ఉన్నారా అనే అంశాన్ని విచారిస్తున్నారు. సునిశితమైన విషయం కావడంతో విద్యార్థినులతో మాట్లాడి వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రతిష్టాకరమైన విద్యా సంస్థలో ఇలాంటి సంఘటనలు సహించబోమని.. పాఠశాల విద్యార్థినులతో మాట్లాడి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. పిల్లలు ఆకతాయితనంగా చేశారా లేదా వేరే బలమైన కారణముందా అనేది విచారణలో తేలుతుందని తెలిపారు. కారకులు ఎవరు అనేది స్వచ్ఛందంగా చెబితే సమస్య కొలిక్కి వస్తుందని



లేనిపక్షంలో సీసీ కెమెరాలు, వేలి ముద్రలు వంటి సాక్ష్యాల ఆధారంగా బాధ్యులని గుర్తిస్తామన్నారు. ఏపీసీ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ గంగాభవాని, సీఐ దివాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నిష్పత్తి కుదిరితేనే..

# ముద్దముద్దలో ఘాటు

భారతీయుల వంటగదిలో అల్లం-వెల్లుల్లి పేస్ట్ కచ్చితంగా ఉండాల్సిందే! శాకాహారమైనా, మాంసాహారమైనా.. ఓ టేబుల్ స్పూన్ అల్లం, వెల్లుల్లి ముద్ద పడాల్సిందే! అయితే, ప్రస్తుత కల్తీల కాలంలో.. అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ను ఇంట్లో తయారు చేసుకోవడమే మంచిది! అయితే, దీన్ని నిల్వ ఉంచితే కొద్ది రోజులకే రుచి మారిపోతుంది. అలాకాకుండా.. అల్లం-వెల్లుల్లి ముద్ద ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి.

అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీలో రెండిటినీ సరైన నిష్పత్తిలో తీసుకోవడం ముఖ్యం. 60 శాతం వెల్లుల్లి ఉంటే.. 40 శాతం అల్లం ఉండేలా చూసుకోవాలి. రెండింటి పొట్టును పూర్తిగా తీయాలి. లేకుంటే, దానిపై ఉండే తొక్క వల్ల పేస్ట్ రుచి మారుతుంది. త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది.

నిల్వ ఉంచేవి ఏవైనా.. తేమ తగిలితే పాడవుతాయి. అల్లం-వెల్లుల్లి పేస్ట్ కూడా అంతే! అందుకే, అల్లం ముక్కలను శుభ్రంగా కడిగిన తర్వాత.. తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాతే మిక్సీ పట్టుకోవాలి. దీనివల్ల పేస్ట్ ఎక్కువకాలం తాజాగా ఉంటుంది.

ఈ పేస్ట్‌కు ఒకటిన్నర టేబుల్ స్పూన్ పల్లి నూనె గానీ, పొద్దుతిరుగుడు నూనె గానీ, ఒక టీ స్పూన్ ఆలివ్ నూనె గానీ, కొద్దిగా ఉప్పు కలుపుకోవాలి. దీనిని గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. నూనెలు, ఉప్పు సహజసిద్ధమైన ప్రిజర్వేటివ్‌లా పనిచేస్తాయి. పేస్ట్ ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేస్తాయి.

అప్పుడప్పుడూ అల్లం-వెల్లుల్లి పేస్ట్ ఆకుపచ్చ లేదా పసుపు రంగులోకి మారుతుంటుంది. ఇలా రంగు మారడం పేస్ట్ పాడవుతున్నది అనడానికి ఓ సంకేతం! మిశ్రమంలో టీస్పూన్ నిమ్మరసం వేసి కలిపి, గాలి చొరబడని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే.. తాజాగా ఉంటుంది.

# మ్యాట్రిమోనీ ముసుగులో.. ఘరానా మోసాలు

(ప్రతాప్)

**పెళ్లి సంబంధం కోసం ఆన్‌లైన్ వేదికలను ఆశ్రయిస్తున్న యువకులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న సైబర్ మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పెళ్లి సంబంధం పేరుతో నమ్మించి, పరిచయం పెంచుకుని, చివరకు రకరకాల రుసుముల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఆగ్రా కేంద్రంగా ఈ మోసపూరిత వ్యవహారం సాగినట్లు పోలీసులు వెల్లడించారు. 29 ఏళ్ల న్యాయవాది అమిత్ కుమార్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి.**




'షాదీ పార్ట్‌నర్' పేరుతో నకిలీ మ్యాట్రిమోనీ సంస్థను ఏర్పాటు చేసి, పెళ్లి కోసం సంబంధాలు వెతుకుతున్న పురుషులను ఈ ముఠా లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంటర్నెట్ నుంచి మహిళల ఫొటోలను సేకరించి, వాటితో నకిలీ వధువుల ప్రొఫైళ్లను రూపొందించేవారు. వివాహ సంబంధాల వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాల పేజీలు, గ్రూపులు, వ్యాఖ్యల ద్వారా సంప్రదింపు వివరాలను సేకరించి, మహిళా టెలీకాలర్లతో బాధితులకు ఫోన్ చేయించేవారు.

మొదట మాటలతో నమ్మకం కలిగించడం.. ఆ తర్వాత క్రమంగా డబ్బులు వసూలు చేయడం ఈ ముఠా అనుసరించిన పద్ధతిగా పోలీసులు గుర్తించారు. రిజిస్ట్రేషన్, ప్రొఫైల్ యాక్టివేషన్, సంప్రదింపు వివరాల అన్‌లాకింగ్, భద్రతా డిపాజిట్, సభ్యత్వం వంటి పేర్లతో విడతలవారీగా చెల్లింపులు కోరేవారు. ఒక్కో బాధితుడి నుంచి రూ.2,500 నుంచి రూ.15,000 వరకు వసూలు చేసేవారని పోలీసులు తెలిపారు. ఒక్కో వ్యక్తి నుంచి పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుంటే ఫిర్యాదులు పెరిగే అవకాశం ఉందనే ఉద్దేశంతో మోసాన్ని రూ.15,000కే పరిమితం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

మోసానికి మరింత విశ్వసనీయత కల్పించేందుకు నకిలీ కస్టమర్ ప్రొఫైళ్లు సృష్టించి, వాటి స్క్రీన్‌షాట్లను బాధితులకు పంపేవారు. ఫొటోలో కనిపిస్తున్న మహిళతో నేరుగా మాట్లాడాలని ఎవరైనా కోరితే, కాల్‌సెంటర్‌లో పనిచేసే మరో మహిళే ఆ వధువుగా నటించి ఫోన్‌లో మాట్లాడేది. ఈ సంభాషణలు కొన్ని రోజులపాటు కొనసాగించి బాధితుడిలో నమ్మకాన్ని పెంచేవారు.

ఆ తర్వాత ఒక్కసారిగా సంబంధం తిరస్కరణకు గురయ్యేది. 'కుటుంబ సభ్యులు అంగీకరించలేదు', 'మాంగ్లిక్ దోషం ఉంది', 'మరో సంబంధం కుదిరింది' వంటి కారణాలు చెప్పేవారు. బాధితుడు మరో సంబంధం కావాలని కోరితే, కొత్త నకిలీ ప్రొఫైళ్లను చూపించేవారు. వాటికీ ఇదే విధంగా ముగింపు పలికేవారు. మరింత సమయం కావాలంటూ సభ్యత్వాన్ని రెండు మూడు నెలలపాటు పొడిగించి, చివరకు గడువు ముగిసిందని చెప్పేవారని పోలీసులు వెల్లడించారు.

ఈ సంస్థ చట్టబద్ధమైన వ్యాపార సంస్థగా కనిపించేలా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల విభాగం, ఉత్తరప్రదేశ్ కార్మిక శాఖలో నమోదై ఉండటం ఈ కేసులో మరో కీలక అంశం. సంస్థ పేరుతో బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులు కూడా పొందినట్లు పోలీసులు తెలిపారు.




అమిత్ కుమార్ తనను సంస్థకు న్యాయ సలహాదారుగా పరిచయం చేసుకుంటూ, కాల్‌సెంటర్ కార్యకలాపాలతో తనకు సంబంధం లేదని చెప్పే ప్రయత్నం చేసినట్లు పోలీసులు ఆరోపించారు.

ఒక బాధితుడు వెబ్‌సైట్ ద్వారా ఆకర్షితుడై రూ.15,000 చెల్లించి మోసపోయినట్లు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభమైంది. డబ్బు జమ అయిన 'షాదీ పార్ట్‌నర్' సంస్థ బ్యాంకు ఖాతాను పరిశీలించగా, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మరో ఆరు ఫిర్యాదులతో దానికి సంబంధం ఉన్నట్లు జాతీయ సైబర్ నేరాల నివేదిక పోర్టల్ సమాచారం ద్వారా పోలీసులు గుర్తించారు.

పోలీసుల దాడి విషయం తెలుసుకున్న అమిత్ కుమార్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. సాంకేతిక ఆధారాలతో అతడిని ఆగ్రాలోని కాలా కుంజ్ ప్రాంతంలో గుర్తించి సెప్టెంబర్ 8న అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఏడు కంప్యూటర్ సీపీయూలు, 47 మొబైల్ ఫోన్లు, రూ.50 వేల నగదు, ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కాల్‌సెంటర్‌లో పనిచేసే వారికి నెలకు రూ.6,000 నుంచి రూ.7,000 వరకు జీతంతో పాటు బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తంపై 10 శాతం ప్రోత్సాహకం ఇచ్చేవారని దర్యాప్తులో వెల్లడైంది. ప్రతి టెలీకాలర్‌కు నెలకు కనీసం రూ.15,000 వసూలు చేయాలనే లక్ష్యం నిర్దేశించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ముఠా సుమారు ఏడాది కాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, వాట్సాప్ సంభాషణలు, డిజిటల్ రికార్డులు, బ్యాంకు లావాదేవీలను విశ్లేషిస్తున్నారు. బాధితుల సంఖ్య వేలల్లో ఉండే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.

పెళ్లి సంబంధాల కోసం డిజిటల్ వేదికలను ఉపయోగించడంలో తప్పేమీ లేదు. కానీ ఆ పరిచయం నిజమైనదో కాదో నిర్ధారించుకోకుండా భావోద్వేగంతో స్పందించడం ప్రమాదకరం. సంబంధం పేరుతో ముందస్తుగా డబ్బు అడగడం, పదేపదే కొత్త రుసుములు విధించడం, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలు కోరడం వంటి పరిణామాలు కనిపిస్తే అప్రమత్తం కావాలి. పెళ్లి సంబంధం విషయంలో నమ్మకం అవసరమే.. కానీ ఆ నమ్మకానికి ముందు నిజ నిర్ధారణ తప్పనిసరి

# నువ్వులను ఇలా వాడితే మీ ముఖం కాంతివంతంగా మారి మెరిసిపోతుంది



నువ్వులను మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. నువ్వుల నుంచి తీసిన నూనెను కూడా మనం వాడుతుంటాం. నువ్వుల్లో ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని సంరక్షించి కాంతిని ఇస్తాయి. చర్మంపైన ఉండే పొరను రక్షిస్తాయి. నువ్వుల్లో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. అందువల్ల నువ్వులు చర్మ సౌందర్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. నువ్వుల నుంచి తీసిన నూనెనే ముందుగా మానవులు వాడడం మొదలు పెట్టారని చరిత్ర చెబుతోంది.

మనిషి నువ్వుల నూనెనే ముందుగా వాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. నువ్వుల నూనెలో మెగ్నిషియం, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ఐరన్, అనేక రకాల బి విటమిన్లు, విటమిన్ ఇ, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఒక టీస్పూన్ నువ్వుల పొడిని తీసుకుని అందులో ఒక టీస్పూన్ పెరుగు వేసి కలపాలి. ఇందులోనే చిటికెడు పసుపు వేయాలి. కొన్ని చుక్కల తేనె వేసి బాగా కలపాలి. దీంతో ఫేస్ ప్యాక్ రెడీ అవుతుంది. దీన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాలు అయ్యాక చల్లని నీటితో కడిగేయాలి. దీని వల్ల ముఖంపై ఉండే రంధ్రాలు మూసుకునిపోతాయి, చర్మానికి తేమ లభిస్తుంది. చర్మం టైట్‌గా మారి కాంతివంతంగా తయారవుతుంది.

1 టీస్పూన్ నువ్వుల పొడిని తీసుకుని అందులో కొన్ని చుక్కల పాలు లేదా తేనె కలిపి ఒక స్క్రబ్ క్రియేట్ చేయాలి. దీన్ని అప్లై చేస్తుంటే ముఖంపై ఉండే మృత చర్మ కణాలు పోతాయి. మురికి, ధూళి, దుమ్ము కూడా పోతాయి. నువ్వుల నూనెను మీరు ముఖానికి నేరుగా కూడా అప్లై చేయవచ్చు. నువ్వుల నూనెను ముఖానికి రాసిన తరువాత కాసేపు ఆగి కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మానికి మెరుపు లాంటి లుక్ వస్తుంది. చర్మం కాంతితో మెరిసిపోతుంది.

అర కప్పు నువ్వుల నూనె, అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్, పావు కప్పు నీళ్లను తీసుకుని బాగా కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి రాత్రి పూట రాయాలి. మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే చర్మం టైట్‌గా మారుతుంది. చర్మం మృదువుగా తయారవుతుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది.

2 కప్పుల బ్లాక్ టీనికాచి అందులో 3 టేబుల్ స్పూన్ల నువ్వులను వేయాలి. మిశ్రమాన్ని చల్లార్చిన తరువాత వడకట్టాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరిపాలను కలపాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని కంటెయినర్‌లో నిల్వ చేయాలి. దీన్ని రోజూ ఉదయం క్లీన్సర్‌లాగా వాడుకోవచ్చు.

ఒక టేబుల్ స్పూన్ నువ్వుల పొడి, ఒక టేబుల్ స్పూన్ పెరుగు, తేనె కలిపి మిశ్రమంగా చేసి ఈ ఫేస్ ప్యాక్‌ను ముఖానికి రాయాలి. కొంత సేపు అయ్యాక కడిగేయాలి. వారంలో ఇలా 2 సార్లు చేయాలి. దీంతో చర్మం తిరిగి పూర్వ రూపాన్ని పొందుతుంది. ఇలా నువ్వులు లేదా నువ్వుల పొడి, నువ్వుల నూనెను వాడి చర్మ సౌందర్యాన్ని పెంచుకోవచ్చు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com